# ఎర్రకలువ

మట్టికుండ భళ్ళున బద్దలయింది. పెంకులలో అన్నంమెతుకులు నిలబడినా, గెంజి మాత్రం పల్లంగా వుండే గుమ్మంవైపు జారిపోయింది. జారిన గెంజి మట్టి నేలలో ఇంకిపోతూంది. అంతవరకూ కాలూచేతులూ ఆడక కొయ్యబారిపోయిన పదేళ్ళ సత్తికి అదిచూసి ఎక్కడలేని సత్తువా వచ్చినట్లుంది. గబుక్కున పరిగెత్తుకెళ్ళింది. నేలపాలయిన అన్నాన్ని కంచంలోకి రెండుచేతులతో ఎత్తబోయి, గెంజితో పాటు జారిపోయిన మెతుకుల్ని దోర్సబోయింది. గెంజి ఇగిరిన తడికి మన్నుకలసిన మెతుకులు ఊర్చుతుంటే బురద బురదయింది. సత్తికి కళ్ళంట నీళ్ళు టపటప రాలేయి.

అప్పటికే గరేకుండలూ, తపేలాలూ, చెంబులూ, గిన్నెలూ, గలాసాలూ వీధిలో కెళ్ళి పడ్డాయి. సత్తి కళ్ళు తుడుచుకుంటూ చూసింది. ఆకలేస్తే కడుపు లోపలికి పోయినట్లే అన్నిటికీ పెద్ద పెద్ద సొట్టలు పడ్డాయి. వచ్చినవాళ్ళు ఇల్లంతా దేనికోసమో వెతుకుతుంటే సత్తి అన్నాన్ని కంచంలో అలాగే వదలి ఇంట్లోంచి పరుగుతీసింది.

ఊరు కాలిపోతున్నట్టు వీధిలోన జనం పరుగులు తీస్తున్నారు. పిల్లల ఏడుపులు... పెద్దవాళ్ళ పరుగులు.... పరిగెత్తుతూ దూరం పోయి మళ్ళీ అక్కడ నిలబడి ఊరికేసి చూస్తూ మొరుగుతున్న కుక్కలు. కన్నెలు తెంపుకు పరుగు లెడుతున్న పశువులు. బెదిరిపోయి ఇల్లెక్కి కూస్తున్న కోళ్ళు....

సత్తి జాపోసిపోతూ మళ్ళీ ఇంటికొచ్చింది. ఆ పిల్ల వెనకాలే ముసల్ది పరిగెత్తుకుంటూ వచ్చి గుమ్మంలో చెల్లాచెదురైన సామాను చూసి అలాగే నిలబడి పోయింది. మాటరాలేదు. అడుగు పడలేదు. ఊపిరాడలేదు.

"ఓలనాయనమ్మో..." పిడుగు మీద పడినట్టు సత్తి దువ్వారం దగ్గర నుండి అరిచింది. ముసల్ది పరుగున వచ్చింది. అప్పటికే నులకమంచం వీధిలోకి విసిరెయ్యబోతున్నారు. కానీ దువ్వారానికి మంచం కోడు అడ్డుకుంది. అడ్డిన మంచం కోడుని విరిచేసారు. తలుపులూ దువ్వారం నుంచి లాగి బయట పడేస్తుంటే, ముసల్ది వాళ్ళ కాళ్ళమీద పడింది, ఆపబోయింది. శక్తి చాల్లే. తలుపు రెక్కని పట్టుకుంది. కాని తోపుతో తలుపుతోపాటే వీధిలో పడింది.

అప్పుడే ఆ ముసల్దాని కోడలు పరుగున వచ్చి ముసలిదాన్ని లేవనెత్తింది. "ఏమీ అన్నేయం? పట్టపగలు దొంగల్నాగ బందిపోట్లనాగ ఈ బాబులేటి ఇల్ల మీద పడ్డారు, మా బతుకుల మీద పడ్డారు..... మగమనుషులు లేని టయానొచ్చి ఏమిది? ఇల్లు వల్లకాడు సేసిర్ను... ఈల సేతులిరిగిపోనూ..." ఆగిపోయింది. కళ్ళు తిరిగాయేమో ముసల్ది కూచండబెట్టినట్టుగానే వెనక్కి వాలిపోయివుండడం చూసి ఆమె గతుక్కుమంది. "సత్తీ! సెంబుతో నీళ్ళుతేయేఁ." కేకపెట్టింది. మళ్ళీ తిట్లు అందుకుంది... "ఈల బుర్రలు పడిపోతూ, ఈలబందం సీరియ్య.... ముసిలి దానిమీద మీ జోరు సూపిత్తార్రా...." తిడుతూనే సత్తి తెచ్చిన నీళ్ళు అందుకుంది. ముసలిదాని ముఖాన నీళ్ళు చల్లి "అత్తా...అత్తా...." అంటూ కుదుపుతోంది. వీధిలోని జనమంతా పోగయ్యారు.

దాంతో ఇంట్లో చొరబడిన బాబులూ బయటకు వచ్చారు. ఆ ఆఫీసర్ల పక్కనే మరో ఇద్దరు పోలీసులు లాఠీలు పట్టుకుని వున్నారు.

వాళ్ళు దగ్గరకు రావడంతోనే "అత్తో......నిన్ను సంపేనారే.... ఈలసేతుల పుండు పుట్ట ...." ఎవరో వారిస్తున్నా ఆ కోడలికి లచ్చింలేదు.

"నోరుముయ్యేఁ .... ఎవలే సంపేనారు? వూరికి ఎనకాముందు సూడకుండా మాటలాడేత్తన్నావుగాని, మీరే మమ్మల్ని సంపతన్నారు. పది సుట్లు తిప్పతన్నారు. బేంకోళ్ళు అప్పులు బేగిచ్చియ్యాల, కానిఅవి తీర్చడానికి గతుల్లేవు .... మామూలు గడగతుంతే ఆగడమే, మీరు మనుషులు కార్రా...." బంట్రోతు బాగా మాట్లాడేడని బేంకాఫీసరు కళ్ళుతిప్పి మెచ్చుకున్నాడు.

"మనుషులయితే ఇలగ సేత్తారేటి" వరదకు కొట్టుకుపోయినట్టున్న సామానుని చూస్తూ అంది కోడలు.

అంతవరకూ ఆగిన విలేజసిస్టెంటు మరి ఆగలేకపోయినట్లు గున్నాడు. వెంటనే అందుకున్నాడు... "మాటకు మాట సమాధానమిచ్చీడిమే, తప్పయిపోయిందని

కాలబడ్డంలేదు" మాటలు పూర్తికాలేదు. అప్పుడే కళ్లు తెరిచిన ముసల్ది "ఔనయ్యా, కాలబడితే ఇదిగో తన్ని తోసేసినారు...." గొంతు బలహీనంగా వున్నా సమయానికి సమాధానమిచ్చింది.

ఇక లాభం లేదనుకున్నాడేమో బేంకాఫీసరే నోరువిప్పి " మా దగ్గర ఎనభై ఎనిమిదిలో పది హేనొందలు అప్పు తీసుకొచ్చారు. వడ్డీతోటది రెండువేల ఒకవందా అరవైరూపాయలు. అణాపైసలతో లెక్కగడితే గాని ఈ సారి ఋణాలివ్వడం జరగదు" తనింట్లోని సొమ్ము ఇచ్చినంత బాగా చెప్పాడు.

"అప్పు తీరిస్పినోలమైతే, ఇంక మాకప్పేల బాబు" ఎవరిదో గుంపులోంచి వచ్చిందా మాట. లాఠీలు దృష్టిసారించినట్టు తిన్నగా నిలబడ్డాయి.

"మీరెలాగ చస్తే మాకెందుకు, పదిహేనురోజుల్లో అప్పు తీసుకెళ్ళినోళ్ళు వడ్డీ తోటి చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేయించాల్సి వుంటుంది" అని - 'మీ ఊరందరికీ ఇదేమాట' అంటూ బేంకాఫీసరు జీపెక్కాడు. అతని వెనకాలే మిగతా వందిమాగదు లంతా. నల్లని పొగని అక్కడున్న వారి గుండెల్లోకి వదిలి జీపు కదిలింది.

అలాగే కొంతసేపు ఎక్కడి వారక్కడే నిలబడిపోయారు. సరీగప్పుడే ఇల్లు కాలిపోయాక నెయ్యిలేరుకున్నట్లు అన్నం నాయుడొచ్చి అన్యాయం అన్నాడు. కాంగ్రెసుపార్టీ ఇంకా ఏలడం మరీ అన్నేయమన్నాడు. తెలుగుదేశం వస్తే ఈ కరువే వుండదన్నాడు. ఇప్పుడయినా అప్పు తీర్చక్కర్లేదన్నాడు.

" ఓరినాయిన సేన్లేరా, ఓఁ సెప్తన్నావు ఆలొచ్చినపుడూ అలాగే అన్నారు. అప్పులు తీర్చనక్కర్లేదు. మావున్నాంగదా అన్నారు. ఇప్పుడేటయ్యింది. ఆలుకాకపోతే ఆలగవర్నమెంటు కుక్కలకొడుకులొచ్చేగదా మా ఆస్తులమీద పడ్డారు. ఆలసాయమూ వద్దు. మీ సాయమూ వద్దు, ఆ బేంకోళ్ళ సాయమూ వద్దు. అయినా అది సాయమా? అప్పొ, సప్పొ? యాపారం..... వొడ్డీ యాపారం....." ఆ ముసిల్దాని కోడలు మాట్లాడుతూనే వుంది, ఎప్పుడు జారిపోండో మరి అన్నం నాయుడు అవుపడలె.

పోగయిన జనమంతా పొగలాగ విడిపోయారు. ముసిలిదాన్ని దాని కోడలూ పక్కింటి తవిటీ కలసి మనిషోరెక్క పట్టుకొని అరుగెక్కించి గోడకు చేరబెట్టారు. అప్పటికే సత్తి వీధిలోని సామానంతా ఇంట్లోకి మోస్తోంది.

దాదాపు ఊర్లోని ఇల్లన్నీ అలానే వున్నాయి. వీధిలోని సామానంతా ఇల్లలోకి సెరుకుతున్నారు. గుమ్మంలోనే గోనె మడతలు పెట్టి పరిచి, దాని మీద తపేలాలవీ పెట్టి

సుత్తితో లో (సొ)ట్టలు తీరుస్తున్నారు. గడప గడపా మాట్లోళ్ళతో మారుమోగిపోతున్నట్టుంది.

"... అనే గున్నా, గున్నమ్మా.. దాలిగాడు వారం పొద్దయిన పికర్లేడు, నీగ్గాని ఏటి సెప్పినాడేటే?'' కొడుకుని గురించి అడిగింది ముసిల్ది. నేలలోకి కొయ్యిపాతి, దాన్లోకి తపేలా బోర్లించి పైనుండి సుత్తితో కొడుతున్న కోడలు గున్నమ్మ అత్త మాట వింది."ఏటి సెప్పుతాడు మీ బాబు, ఆ ముష్టి జూటుకంపెనీల పడి వీరముష్టి బతుకులయిపోనాయి.... ఎపుడూ మూసీడిమే. నెలల్లా రెక్కలు ముక్కలు సేసుకోడము ... జీతాలురావు. ఇలగ ఎందరి నోట్ల మట్టిగొడతరో? ఇలగ ఎన్నాళ్లు ఆసిబోతాదో?...'' అత్తకే చెప్తోందో, తనలో తను గొణుక్కుంటోందో. కాని, ముసిల్ది కూడా కోడలు మాటల్ని పట్టించుకున్నట్టులేదు. గున్నమ్మ పనిలో పడిపోయిందేగాని అత్తను గమనించలేదు.

" ఓలమ్మా తమ్ముడాలూ, బాప్ప వస్తన్నరే ..'' సత్తి అరుస్తూ చేతిలోని గరేకుండని వదిలి పరిగెత్తింది. గున్నమ్మ కూడా పని ఆపి "ఏంవా వదినా బాగా, రార్రా,.. పెంటా, సిమాద్రీ...'' వదిన్ని పలకరిస్తూనే పిల్లల్ని రెండు చేతులతో దగ్గరకు లాక్కొంది. సత్తి తమ్ముల్లిద్దరిని చూసి ఎన్నాళ్ళో అయినట్టుగ ముద్దులాడేస్తోంది.

ఎప్పుడు అరుగు దిగిందో గాని ముసిల్ది కూతుర్ని చూస్తూ "నాగమ్మా... నాగా ... ఇదేనేటే రావడం'' అంటూ తూలి పడబోయింది. కూతురు చెయ్యి ఆసరాకాయడం పనికొచ్చింది.

"అమ్మా.. నువ్వేటిలగయిపోనావు? వదినా ఈ ఇల్లేటి ... సామానేటి? ఏటయ్యిందర్రా?'' నాగమ్మ అడిగింది. ఏదో జరిగినట్టు చెమటలు పట్టిపోతోంది. పొరుగింటి తవిటి నాగమ్మకు తాగడానికి చెంబుతో మంచినీళ్ళిస్తూ "నువ్వు కుదిటపడే, ఏటి లేదులేయే, ఎప్పుడున్నదేనా ....ఆ బేంకు బావులు అప్పు తీర్సలేదనీసి ఇలగ సేసినారు'' అంటూ జరిగినదంతా చెప్పింది.

నాగమ్మ విని నిట్టూర్చింది. తల్లిని అరుగుమీద కూచోబెట్టి గున్నమ్మకి పనిలో సాయపడుతూనే చెప్పింది. గవర్నమెంటప్పుకీ బుగతప్పుకీ తేడాలేదంది. మన్నుని నమ్మి ఆ డబ్బంతా మట్టిల పొయ్యడమే గాని కూడుకు మిగిలిందా, కూరకు మిగిలిందా అని నిలదీసింది. ఈ ఏడు చిటుక్కుమని చినుకే లేక ఆషాడము తిరిగిపోతంది గాని ఆశ తీరలేదంది. ఆకాశం కరగలేదంది. కార్తీక మొచ్చినా కళ్ళువాసి పోవడం తప్ప కళ్లాపు వానరాలేదంది. కరువు తీరలేదంది.

సత్తి తమ్ముళ్ళిద్దరితో ఆడుకుంటుంటే గున్నమ్మ కూతుర్ని కేకేసి, పొయ్యి

రాజెయ్యమంది. ఆ పిల్ల కదల్లే. నాగమ్మే గున్నమ్మ వారిస్తున్నా పొయ్యి రాజేసింది. జనప రువ్వలు జరజర కాలిపోతుంటే గున్నమ్మ బియ్యం కడిగి ఎసరుపోసి పొయ్యి మీద కెక్కించింది. చివరవరకు అంటుకుంటున్న అగ్గిని ఆర్పేందుకు.... ఎత్తరకుండా జనపరువ్వల మీద నీలు చల్లింది. ముసిల్ది అరుగుమీద నుంచి లేచొచ్చి పొయ్యిదగ్గర కూర్చుంది.

"ఇయ్యేడేటేసినారు మెట్టుల? నిరుడు జనుం బాగయినట్టుంది. ఇంత పొడుగుంది రువ్వ...ఎంతొచ్చింది రేటు?'' అంటూ నాగమ్మ పొడుగుగా వున్న జనపరవ్వల్ని పుటుక్కున విరిచి పొయ్యిలో దోపింది.

" ఏమి రేటువా వదినా, నువ్వు రాలేదు. అమ్మతవుఁడు మాయన్న వచ్చి వున్నాడు, సూసినాడు సెప్పలేదా? జనపనారేసిన బదులు వట్టిన బూమి వదిలీసినా బాగున్ను. లేకపోతే పుట్టి (7 కట్టలు, 1 కట్ట=38 కేజీలు/పుట్టి =266 కేజీలు) కి ఆరొందల్నుండి ఏడొందలఇరవై దాటలే. మనమూ గాబర్ల అమ్మేసాం, ఎంత లెక్కనుకున్నావు ఆరొందలయాభై లెక్క....." గున్నమ్మ చెప్పడం పూర్తికాలేదు.

"ఇయ్యేడు పుట్టీకి పదేనొందలిత్తామంతన్నారట..."ముసిల్ది అంది.

ఆ మాటకు ఎందుకనో గున్నమ్మ గొంతు పెద్దదైంది. తగువుకి వస్తున్న దానిలాగా "ఎవడన్నాడు... పదేనొందలని? ఆ పెసిడెంటు బావేనా? ఆ బావు మాటలన్నీ పుట్టీకి ముప్పందువే పచ్చి. లేప్పోతే నిరుడు ఆ బాబే ఆరొందలయాభై లెక్కన అమ్మించేడు, అంతకన్నా ఎక్కువ పలకదనీసినాడు, నీ కొడుక్కీ నీకూ నూరిపోసినాడు..." మాటలాడుతూనే వుంది. మాటల మధ్యలో పొరుగింటి తవిటొచ్చి అందుకుంది.

"నిరుడు లాభాలే గూబలకి తగిల్నాయి. ఇయ్యేడు పదేనొందలు కాదు పుట్టీకి రెండువేలిచ్చినా జనుమేస్తామే?! ఇప్పుడా మాటలేనికి గాని... ఓలి నాగమ్మా... పద... పదే, అయినా నిరుడేటి మూనిరుడేటి ఎయ్యేడయినా ఏది పండిస్తామో అదే సవక. పండించని దెలాగైనా పిరుమే! అంతిచ్చీసి కొనేస్తాం... ఇంతిచేసి కొనేస్తామనీసి ఆలంతారుగదా, గాని ఒకదప ఒళ్ళు సచ్చిపోతే ఇంకోదపా ఎలాగ పూనుకుంతామే? సర్లేగాని ఓలి నాగమ్మ పదే... మా ఇంటికి రావేటి? నువ్వా సమయానికొచ్చినావు, మీ నేస్తరాలు నచ్చిమీ వచ్చొంది. ఆ గుంట మళ్ళీ నీళ్లోసుకుంది... రాయే సూద్దూగాని, వంటవ తోటికి ఎలిపొస్తువు" అనీసి తవిటి తన కూతురు చూపుకి నాగమ్మను తీసుకెళ్ళింది.

గున్నమ్మది ఎన్నాళ్ళకానుండి వున్న గుబులో గాని అదీవాల గొంతువరకొచ్చింది. కాని కక్కయ్యలేకపోయింది. ఆ ఊసు మళ్ళీ ముసల్ది ఎత్తకపోయినా గాని గుండెల్లో

గొలపాడుస్తోంది. పొయ్యిమీద కుండ కుతకుతలాడినట్లే గుండె గుజగుజమంది. గొంతు ఆర్చుకుపోతున్నా కళ్ళలో సన్నటి తడి. ఆ తడి గతించిన కాలాన్ని తడిమింది.

అడుగుకు అడుగూ పెరుక్కొచ్చి పద్దెనిమిదడుగులదాకా పెరిగిన జనుం మొక్కల్ని సూసి ఊరంతా ముక్కున వేలేసుకుంది. ఈ మద్దికాలంలో అలాటి పంట సూడలేదని సూసిన ప్రతోరు అనీవోరు. మనుషుల్ని మించిపోయిన పొడుగు సూసి మనసు తేలిక పడినా -దిగుబడి ఎప్పుడొచ్చినా - ముందల అప్పు కోసం దేవురించక తప్పలేదు. ఎకరా మెట్టల్లా జనుమే. అదారు మాసాల పంట. మెట్టు బోరింగులతోటి తడపక్కరలేకపోయినా, రెండు మూడు దపాల వర్షంతోటి సరిపెట్టుకున్నా-గొప్పుకి ఎకరా మడికి నలుగురేసి తవ్వినా అయిదురోజుల పని.

దాలిగాడికి జూట్ మిల్లుకని నెల్లిమర్ల పోవాలంటే తెల్లారగట్ల పోతే మళ్ళీ పొద్దోతేనే రావడం ఇంటికి. మరి ఆ మనిషి లెక్కలేదు. పెద్దమరిది ఇల్లరికమనెల్లి ఆ నెల్లిమర్లలోనే వుండిపోండు. జూట్‌మిల్లులోనే ఆ బాబుకీ పని. ఆ మనిషికి సంబంధమే లేదు. ఆ తరువాతోడు లారీలంట క్లీనరుగ ఎలిపోతండు. ఆ తరువాతోడికి సారా యారక్కులో పని. ఈ లిద్దరూ ఎప్పుడొస్తారో ఎప్పుడెల్తారో తెల్దు. ఇంట్లో మగ మనుషుల చెయ్యి సాయిం లేదు. పెద్దకోడలైనా పెద్దదిక్కైనా గున్నమ్మే చూడాలి. ఇంటి ఆడపిల్లని లోతుగడ్డ ఇచ్చినారు. ముసల్దానికి ఒకపూట బాగుంటే మరొక పూట బాగోదు. ఆ సత్తిగుంటొచ్చి సాయబడదామని జింకినీలా సెయ్యబోయినా ఆ సిట్టి సేతుల్ల బొరిగి జారి ఏ మొక్క మొదుల్న పడిపోతుందోనని భయం. అందుకే ఆ పిల్లకి ఇల్లు ఒప్పజెప్పి తను గొప్పు తవ్వుతూనే మరో నలుగుర్ని పనికి పిలిచింది. రోజు కూలీయే. మగోళ్ళు కయితే ఇరవైరూపాయలివ్వాలని, ఆడాళ్ళకయితే పదిరూపాయలేనని అమ్మలక్కల్ని పిలిచింది. తనింకొకరి కూలి పనికి వెళ్తున్నా - తన పని తాను చేసుకోలేక పిలవక తప్పింది కాదు.

గొప్పుల పనయితే అయిదురోజుల్లయిపోయింది. కాని రోజుకి నలుగురికి నలభై లెక్కన అయిదు రోజులుకి రొండొందలు కూలి డబ్బులు పంచవలసివచ్చింది. పోని గొప్పుతో తీరిపోయిందా అంటే లేదు.

మళ్ళీ జనుం మొక్కల్ని పీకడానికి నలుగురు ఆడోల్ని, ఒక్క మగమనిషిని పెట్టింది. తను వేళాపాళా లేకుండా, చేతులు కాయలుగాసినా, లెక్కలేకుండా కష్టపడినా అయిదురోజులు పట్టింది. ఇంతో అంతో ఏమి? అందరికంటె నాలుగు మొక్కలెక్కువే పీకింది. ముసల్ది ఎక్కడ నుండొచ్చిందో సత్తువ! అయిదు రోజులకి మగ మనిషికి ఇరవై

లెక్కన వందరూపాయలు, నలుగురు ఆడోళ్ళకి నలభై లెక్కన ఐదు రోజులకి రెండొందలు, మొత్తం మూడు వందలు. మగ కూలీని పెట్టకుండా సాహసిద్దుమన్నా - మనసు పీకినా, కట్టలు కట్టడం అదీ బాగోదు. ఇదేటమ్మ మగకూలీ నెట్టకుండా మాసేతే కట్టలు కట్టించీ మంతన్నావా? అని ఆరా తీస్తారని.... ఒక మగమనిషిని పెట్టినా -గున్నమ్మా ఆ మగోడితో సమానంగా పనిచేసింది. ఇంకా మగమనిషే సుట్టకని, టీకని ఒక్కోదపా కడుపు నడుస్తందనీసి పని ఎగ్గొట్టీసీ వోడు. ఏద్దై తేటి పీకడాకి మూడొందలొగ్గిసినాయి.

అంతటితోటయ్యిందా? లేదు. ఏ గుమ్మిలోనో.... సెరువులోనో.... మొక్కలు నానబెట్టడానికీ వెతుక్కోవాల్సి వచ్చింది. ఏదో పొలం పల్లమయి కొద్దిగయినా నీలుంటే నానేతకి ఇంత ఇబ్బంది లేకపోను. అసలే మెట్టుకొర్రు. ఏటి సెయ్యడమా అని తోవ ఎతుక్కునీసరికి ఎండకు మొక్కలు సుట్టికెలిపోయి ఇంకా తీసినకాడే పడివుండడం ఆ బరువంతా గుండెలమీదే వుండేది. పాపం దాలిగాడు సెలవు పెట్టీసి తిరిగినాడు. అప్పుడికే సెరువుల ఆ ప్రెసిరెంటూ, పెద్ద మనుషులూ సర్దుకుపోయారు. ఈ కట్టలు అందల కలిసిపోతే .... మెడ్డీస్తే ... అడిగితే తగువులూ.... ధరమాలూ సాలక 'ఆ ఇరక జంతిల నిన్నెవుడెయ్యమన్నాడేస్' అని తప్పు పడతారు. పైగా ఏలుమాలు పండీసినట్టు ఎకరా మొక్కలకే కళ్ళగ్గసం పడీవోలు ఇంకొందరు.

ఇలాగయి దూరమయితే కానని దాలిగాడు పొన్నూరులో వున్న తనతో పని చేస్తున్న పైడిరాజు పొలానికి కట్టలు తీసుకెళ్ళి ఊరేయించడానికే నిర్ణయించుకున్నాడు. తీరా చూస్తే బంగీలేదు. బక్కాలేదు. కరువు కాలంలో పశువుల మేతకే కష్టమయిపోయి ఇంతో అంతో ఉన్నోళ్ళే బండీ, బక్కా అమ్ముకుంటుంటే వాటిజోలికే పోకూడదని ఎప్పుడో గట్టిగా నిర్ణయించుకున్నారు. అవసరమైనప్పుడు బాడుగకి తెచ్చుకోవచ్చు గాని వున్న రెండకరాలకి (మెట్టు ఎకరం, పల్లం ఎకరం) బండీ పోతులు తలకు మించిన తలపాగాయేనని నమ్మకం.

ఇప్పుడు బండీపోతులూ అవసరమైనా, బాడుగ ఎంతో యిచ్చుకుందామన్నా బండి ఎక్కించడం... మళ్ళీ అక్కడ దించడం... పైగా ఎన్ని సుట్లు తిరగడం? బండి జాడి (దారి) సరిగ లేదు. చుట్టూ తిరిగెళ్తే బోలెడంతదూరం, అడ్డగయితే కొంచెం దగ్గిర. అందుకనే కూలీల్ని పెట్టి మోతకే నిర్ణయించుకొన్నారు. కూలీకి పెట్టిన మగకూలీలు నలుగురితోటి సరీగ దాలిగాడు, గున్నమ్మా కట్టలు మోసారు. రెండ్రోజుల్లో జనుం కట్టలన్నీ మోయడమైపోయింది. మోతపనని పాతిక లెక్కన నలుగురికి రెండ్రోజులకి మరో

రెండొందలు వదిలిపోయాయి. దాలిగాడికీ గున్నమ్మకీ ఒళ్ళు నొప్పులు మిగిలిపోయాయి. ఇద్దరికీ జ్వరాలు వచ్చి చేరాయి. దాలిగాడు సెలవు పెట్టినా గున్నమ్మకి అలాగే తిరగక తప్పలేదు. మందూ మాకు లేకుండా కషాయాల్తోనే సరిపెట్టుకున్నారు.

ఇంతటి తోటయ్యిందా అంటే లేదు! ఊరిన జనప మొక్కల్ని ఒడ్డుకు తీసి, ఆ కట్టల్ని ఒలిపించడానికి..... నార తియ్యడానికి ముసల్ది, దాలిగాడు, గున్నమ్మా వున్నా ఐదుగురేసి మగ కూలీల్ని ఇంకా ఐదుగురేసి ఆడ కూలీల్ని పెట్టినా-నార ఒలడానికి ఒకరోజు తక్కువ వారం పొద్దు పట్టింది. గున్నమ్మ చిన్నమరిదీ రెండు దపాలు రెండ్రోజుల పనిలో సాయపడ్డాడు. ఇంటిల్లిపాదీ కష్టం వొదిలి కూలిడబ్బుల కింద మరో తొమ్మిదొందలు ఖర్చయ్యేయి. డబ్బులు సమయానికి లేక ఐదు రూపాయల్లెక్కన వడ్డీకి తేవాల్సి వచ్చింది. దాలిగాడి జీతం డబ్బులు ఇంటి ఖర్చులకే కటీమిటీ అయ్యాయి. చెల్లి పెళ్ళప్పుడు తీసుకున్న లోనుకని జీతం సగం కోసేస్తుంటే అందల ఇదొకటి వొచ్చిపడ్డం తోటి, తీసిన నార ఎప్పుడుకి అమ్మేద్దామని వుండీది.

జూట్‌మిల్లు వుందనే గాని ఆలు ఈ నార కొనరు. షావుకార్లే కొంటారు తమ రైతుల దగ్గర. కొన్నది కొద్దిగ బాగుచేసి బేళ్ళుకట్టి మిల్లుకమ్ముతారు షావుకార్లు. ఆ షావుకార్ల దగ్గరే మిల్లోళ్ళూ కొంటారు. ఆలకీ ఈలకే లింకు. ఇంకేటుంది? షావుకార్లు చెప్పిందే రేటు! ఆలిష్టమొచ్చిన రేటుకి కొనీసుకొని -ఆరుమాసాలదాక మిల్లు ఆడించడానికి సరీగ అమ్ముతారు. గోగుకొనడానికి జూట్ కార్పొరేషను వున్నా, ఆ బావులు ఏడాదికొకపాలీ కనబడరు. ఇంతాచేస్తే ఎకరా జనుం పంటకీ నార రెండు పుట్లే (532 కేజీలు) అయింది. బాగానే పండిందని అందరయితే అన్నారు గాని, పుట్టీకి ఆరొందల యాభై లెక్కన రెండు పుట్లకి పదమూడొందలు చేతికొచ్చింది. కాని పంట 'సరుకు' అవడానికి ఎంత మిగిలిందంటే - గొప్పుకి రొండొందలు, పీకడాకి, కట్టలు కట్టడాకి మూడొందలు, కట్టిన కట్టలు మొయ్యడాకి రెండొందలు, ఊరిన నార ఒలడాకి తొమ్మిదొందలూ మొత్తం పదారొందలు లెక్క తేలింది. ఆ లెక్కలో ఆరు మాసాలుగా ఇంటిల్లిపాదీ పడ్డ కష్టం ఇగిరిపోయి లెక్కల్లో తేలలేదు. మిగిలింది మూడొందల ముప్పు! వడ్డీలతో అప్పు!

అందరూ అంతెత్తు పెరిగిన జనుం మొక్కల్ని పొగడ్డం గుర్తురాలేదు గున్నమ్మకి. అవి ఏవో రాక్షస మొక్కల్లా తమ నెత్తుట్ని తాగి బలిసినట్లు తోచింది. అస్థి పంజరాల్లా మిగిలిన జనపరువ్వల్ని కసిదీరా పొయ్యిల దోపింది. మంట భుగభుగమని లేచింది.

"ఒలమ్మీ ...ఒలి గున్న ... గున్నమ్మా ...." ముసలిదాని కేకతో గున్నమ్మ ఈ లోకాని కొచ్చింది.

అప్పటికే అన్నం నప్పీముద్దయింది.

"పొయ్యికాడే వుండి ఏటిసేత్తన్నావే ...." అన్న ముసల్ది గున్నమ్మ ముఖంలో ఏం చూసిందోగాని మరేమి మాట్లాడలే. గున్నమ్మ అన్నం కుండను దించి వారుస్తుంటే గోంగూర పులుసు పొయ్యెక్కించింది ముసల్ది.

కొంతసేపు గడిచాక ముసల్దే అంది...." ఈ నెల పెంటడు, సిమ్మాద్రీ తోటి వచ్చిందేటి నాగమ్మా ... ఆలకి సెలవులు గానేటి?"

గున్నమ్మ కొడుకులిద్దర్నీ పిలిచింది. బడి సెలవులా అని అడిగితే- ఆ గుంటలిద్దరూ "సెలవులు కావు గాని బరి లేదత" వాళ్ళ మాటలు అర్థం కాక ముసల్ది, గున్నమ్మా రెట్టించారు.

"బరిలేదంతే, ఇకన వుండదాట! ఇకన యిక్కడ వుండిపోవడమే" పెద్దాడు పెంటడు చెప్పాడు. ఆ మాట ముసల్దానికీ గున్నమ్మకీ భయపెట్టినా సత్తికి మాత్రం చాలా సంతోషాన్నిచ్చింది.

"ఈ నెల ఈలయ్యగాని డబ్బులు పంపలేదేటే? పంపకపోతే మాతరం బరిలేపోడమేటి?" అనుమానంగా అడిగింది ముసల్ది. గున్నమ్మ అత్త మాటలకి జవాబివ్వలే. ఏదో ఆలోచిస్తోంది. దేవుడిమీద పత్తిరి తప్పినా నెలనెలా పిల్లల చదువులకని పంపక తప్పని మూడొందలూ పెనిమిటి ఈదపా పంపినట్టు లేడు. జూన్ నెల జీతాలే యింకా ఇవ్వలేదు. అందుకనే మళ్ళీ కంపెనీల అగ్గి పుట్టక మానదు. అయినా ఈ ఊర్లోనే బడివుంటే పిల్లల్ని ఆలింటిదగ్గర పెట్టిన బాధ లేకపోను. ఇక్కడయితే గెంజో గడుగో తాగి ఎలాగో గడిచిపోను, ఇప్పుడో మూడొందలు ఆలతిండికని ఎత్తి పంపాలంటే సెత్తికి మించిన పనయిపోతంది. డబ్బులు పంపలేదని నాగమ్మో, దాని పెనిమిటో... ఊహించలేక పోయింది గున్నమ్మ.

గున్నమ్మ వుందంటే వుందిగాని సత్తిగుంటే గోంగూర పులుసు తాలింపు పెట్టింది. తాల్లేకపోయిందేమో ఆకలి. అత్తని పిల్చుకొచ్చింది! నాగమ్మ రావడంతోనే ముసల్ది అడిగింది. "అనేఁ అమ్మీ ఈ బాడుకావుల్ని ఏల తీసుకొచ్చినావు. నీతోటి వస్తామని అల్లరి గట్రా సేసినారేటి? అలాగయితే ఆలమావకి సెప్పి సొంటి పిక్కలో, సురకలో తీడించీ లేకపోనావా? ...? మాట్లాడుతోందేగాని డబ్బులు విషయం గుర్తొచ్చి ముసల్దాని గుండె బితుకు బితుకు మంటోంది. గున్నమ్మ పరిస్థితీ అలాగే వుంది. నాగమ్మ ఏమీ మాట్లాడకపోయేసరికి మరింత అనుమానం అత్తా కోడళ్ళలో ఎక్కువయింది. "సెలవులు

గానేటి?" అంతకన్నా ఏమనాలో తెలియలేదు ముసల్దానికి. గున్నమ్మ మాత్రం వుమ్మి మింగుతూ .... "వొదినీ! .... ఈ దపాకి లేటయిపోనాం, రొండు నెల్లయిపోతందిగానీ మీ యన్నకి జీతాల్లేవు. ఇంట్ల డబ్బులకి సీముసురయింది. ఏదో సదువుకుంతే ఇంత ఆలన్నా బాగుపడతారనీసి ఆశపడుతున్నాం ... గాని అదీ తీరేనట్టులేదు ..... " అంటోందే గాని ఆమె కళ్ళల్లో నీళ్ళూరుతున్నాయి. ఆమె ఎవరి ముఖం చూడలేకపోతోంది. పెంటడూ, సిమ్మాద్రి తల్లి ముఖం చూస్తూంటే ఆలకీ ఏడుపు ఎగతన్నుకొస్తున్నట్టుంది. బిక్కయిపోయారు. సత్తి గుంటకి ఆకలి ఎటుపోయిందో అన్నాన్ని మానేసి అమ్మను చూస్తోంది.

"వొదినీ! .... కోడిపిల్లల్లాగ ఆలిద్దరు గుంటలు ఎంత తింతారు! అయినా ఆలెవులు? నా మేనళ్లుల్లేనా? ఎటొచ్చి గోసికి కురస బతుకులయిపోయి మీకాడ డబ్బుచ్చుకోడంగాని, మాం బాగుంతే ఈ ... ఇదే .... లేకపోను ...., మావీ కూలిముండ బతుకులే ... అలాగనీ నీ పిల్లల్ని తీసుకొచ్చీసు నామనుకుంతన్నారు గావాల, అదేటి లేదు, అయినా ఇదేనా ఇన్నాళ్లయిన సూసిందీ?!" నాగమ్మ గుక్కతిప్పుకొని మళ్ళీఅంది.

... "ఇయ్యేడు ఆల బరులు ఎత్తేనారు. మేష్టుల్లేరట. బరులు బాగ నడపలేరట. అలాటప్పుడు పేరు బదలాంకి తప్ప వుండీ ఎందుకనీసటోలమ్మా. మా లోతుగడ్డ లోనే కాదు, సవరవిల్లి, పల్లేటి వలస, ఇంక కె.ఎస్. వలస .... అన్ని కాడ్ల ఎత్తేనారు. ఇప్పుడు గుంటలెవులికీ అక్కడ సదువుల్లేవు...."

ఆ మాటలు వింటుంటే గున్నమ్మ గుండె భారమయిపోయింది. తన పిల్లల భవిష్యత్తేదో నాశనమయిపోతున్నట్టు భయమూ వేసింది. పిల్లల్ని పట్టుకు వలవలా ఏడ్చేసింది. అది చూసి పిల్లలిద్దరూ ఏడ్చేస్తున్నారు. ఇదంతా చూస్తూంటే సత్తికీ ఏడుపొస్తోంది. బెక్కి బెక్కి కళ్ళు తుడుచుకుంటున్న సత్తిని "నువ్వేమే" అంటూ, మిగతా పిల్లలిద్దర్నీ - "ఊరుకోర్రా" అంటూ "వొదినీ, నీకేటయిందే పిల్లలు జడుసుకుంతన్నారు. నువ్వే ఇలగయితే ఎలగే....? గొప్ప సదువులు ఎవులికెరక లేదు. సదవక పోతే సచ్చిపోతారు గానేటే?! పోని అంతక్కాదు అని గానాంతే, ఆలకి ఆలోచిస్తే పొన్నూరు బరికయినా, లవింత దూరమయినా ఆలే ఎలిపోరేఁ ... దానికి బెంగేటిలేయేఁ నాకు తెలీకడుగుతాను, మనం సదుకోలేదు బతకడం మానీసినామా?" ... ఊరడింపో మందలింపో గున్నమ్మ గుబులుకి కొంత అడ్డుకట్టవేసింది నాగమ్మ. ముసల్ది తన పయ్యాడ చెంగుతో మనుమల కళ్ల తుడిచింది. తనూ ముక్కు చీదింది.

నాగమ్మ పిల్లలకి అన్నం వడ్డించింది. గున్నమ్మ మరో కంచం తీసి వడ్డించి నాగమ్మను తినమంది. కూర్రవ్వ లేనందుకు నొచ్చుకుంది. తకరాలేదని గోంగూరతో తండాగే తింది నాగమ్మ. పేచీపెట్టకపోయినా ప్రేమతో పిల్లలిద్దరికీ గున్నమ్మ అన్నం తినిపించింది. 'కోడిగుడ్డు కొంగ గుడ్డు' అని చెరోముద్దా చెలాకీగా తింటూంటే సత్తికి ఇందాకటి దుఃఖమంతా ఎటుపోయిందో గాని ఆల చిన్న నోర్లు అంతంత పెద్దముద్దలు ఎలా మింగుతున్నాయా అని ఆశ్చర్యంగా చూసింది.

ముద్దముద్దకూ నీళ్ళడుగుతున్న పెంటడ్ని "ముద్దముద్దకూ నారాయణే, అలగ మద్దిల లాల తాక్కూడదు. తప్పు" అంటుందే గాని ముసల్దీ మనవడికి నీళ్ళందివ్వడం మానలేదు.

పిల్లలవీ నాగమ్మదీ తిల్లయాక, చిన్నోడొదిలిన ఎంగిలి కంచంలోనే అన్న మెయ్యమంది సత్తి. ఆ పిల్లమాటే నెగ్గించి, ముసల్దానికీ అడుగన్నం వూర్చి తపేల్లో గున్నమ్మ నీళ్ళు పోసింది. నాగమ్మ అనుమానం చూపుల్ని గ్రహించిన గున్నమ్మ "లేదువాఁ కంచఁవుడు సల్దిపకాలున్నది, బక్కా?బడుగా? పెంటల పోసేడమేనికని" అడక్కుండానే సమాధానమిచ్చి కంచం దగ్గరకు తీసుకుంది. అన్నంతో గెంజిలేదు. మెతుకులు కొద్దిగ మట్టిరంగున్నాయి. పారేడానికి మనసొప్పలే. నాగమ్మ కంటపడకుండా నీళ్ళతో మెతుకుల్ని కడిగింది. అనుమాన పడిపోయి తెలిసిపోతే - ఇంటాడపిల్ల బాధపడతాదనీసి "తరవాణి ఎక్కువ పోసీసినారు, పుల్లరొడ్డు" అంటూనే చప్పటి అన్నాన్ని మింగింది గున్నమ్మ. గోంగూర పులుసు ముద్ద మీద వేసుకుంటే కొంత రుచొచ్చింది. కాని పంటికింద ఒక్కోరాయి ప్రాణం తీసింది. దోర్సుకొని తాగితే అడుక్కి చేరడు రాళ్ళు చేరాయి. అవి చూసి సత్తి, కుండ పగలగొట్టిన సంగతి పూసగుచ్చినట్లు నాగమ్మ ఎదుటే చెప్పింది. గున్నమ్మ కళ్ళెర్రగించడానికీ వీలుకాలే.

సత్తి చెప్పింది విని, "మరి సేరుడు గింజలు పొయ్యిమీద పెట్టీ లేకపోనావా" అంది నాగమ్మ. గున్నమ్మ మాటాడలే. ఏం అర్థం చేసుకుందో ఏమో నాగమ్మ ఇంట్లోనికి పోయి సామానులు సర్దడం మొదలు పెట్టింది. ముసల్దీ కూతురుకు సాయపడుతోంది.

గున్నమ్మ ఎంగిలి చేయితో రాటకు చేరగిలబడి ఏమీతోచనట్లు కూర్చుంది. సత్తి ఎంగిలి కంచాలు, గోంగూర పులుసు తపేలా, అన్నం కుండ ఎత్తుబెట్టి కడిగి కాలేసింది. పేడతెచ్చి తెల్లవారి గెంజిపారిన చోట ఈగలు ముసురుతుంటే అదంతా అలికింది. పనులన్నీ చేసొచ్చినా తల్లి అలానే వుండడం సత్తిని భయపెట్టింది. "సెయ్యికడుక్కో" అని

చెంబుతో నీళ్ళిచ్చింది. ఇంతలో తమ్ముళ్ళ కేకలు వీధి గుమ్మంలో వినిపించి అక్కడి నుంచి పారిపోయింది.

గున్నమ్మకి మళ్ళీ పిల్లల చదువులే గుర్తొచ్చి ఆ ఆలోచనల్లతోనే మునిరి పోయింది. అంతకు మునుపే, వారం ముందల 'అక్షరాలు నేర్చుకోండ'ని వీధుల్లో జనంతో తిరిగిన కలెక్టర్, ఇంకా పెద్ద పెద్దోలు, మేష్టర్లూ అందరూ గుర్తుకొచ్చారు. వాళ్ళ మాటలు జ్ఞాపకాని కొచ్చాయి. అక్షర విజయం బేనర్లూ, ఇల్లాలి చదువు - ఇంటికి వెలుగు, 'నిరక్షరాస్యతను నిర్మూలించండి' అరుపులూ, చిన్నపిల్లలు పట్టిన జెండాలూ అన్నీ కళ్ళముందు కదిలాయి గున్నమ్మకి.

'నీ వెంత చదివావు' కలెక్టరు అడిగాడు. మా బావులిద్దరూ చదవతన్నారని ఆలకి గొప్పగా చెప్పింది గున్నమ్మ. నీకు 'అ ఆ ఇ ఈ లొచ్చా' మేష్టు అడిగాడు. 'ఓ' అంది. ఎంత "చదువుకున్నావ్ మరి" మళ్ళీ మేష్టుబావే అడిగాడు. 'అఆఇఈ' లనే చెప్పింది. అందరూ నవ్వేరు. తనెందుకో సిగ్గుపడింది. 'చదువు నేర్చుకో' అన్నారు. 'రాత్రి బడుల్లేవు' అంది. 'పగలు బడులూ లేవు' అంది. పిల్లలకీ లేవంది. తను చెప్తున్నది వినకుండా టయాలు చూసుకున్నారందరూ. 'మీ ఇల్లకొచ్చి నేర్పుతార్లే' అన్నారెవరో. ఆ తరువాత బల్లలు (పలకలు) పంచీసినారు. దీపం బుడ్డీలు ఎవులెవులుకో పేర్లు చదివి ఇచ్చారు. ఆ ఒక్కరోజే పండగయిపోయింది.

సంవత్సరం పొద్దయిన సంబరం సల్లారిపోయింది. బడులు ఎత్తీడమేటో? ఇల్లకొచ్చి పాఠాలు చెప్పడమేటో గున్నమ్మకి అర్థం కాలే. పెంటడూ, సిమ్మాద్రి కుదిపేదాక గున్నమ్మ తెలివికి రాలే. తెలివొచ్చాక బల్లల మీద పిల్లలు రాసుకొచ్చిన అక్షరాలు చూసి తన కర్థం కాకపోయినా-తెలివైనవాళ్ళు అనుకుంది. ఇద్దర్నీ ముద్దులాడింది.

"మా వుస్కూల్లో నానే ముందు..." అన్నాడు పెంటడు.

"నానూ ముందే ...." చిన్నాడు సిమ్మాద్రి కూడా.

గున్నమ్మ ఇంక ఆగలేకపోయింది. వల వల మని ఏడ్చేసింది. పిల్లలిద్దరూ తామేదో తప్పు చేసినట్టయి బిక్కయిపోవడం చూసి గున్నమ్మ కళ్ళు తుడుచుకుంది. "ఏమేఁ...." పెంటడు తల్లి గెడ్డాం పట్టుకున్నాడు. గున్నమ్మకి మాట రాలే.

ఇంతలో "అయిస్క్రీం... ఆరంజి అయిస్క్రీమ్...." కేక వీధిలోంచి వినబడుతోంది. పిల్లలిద్దరి కళ్ళల్లోవెలుగు చూసి కొనడానికి లేచింది. చెయ్యి కడుక్కొచ్చింది. రూపాయిన్నర పెట్టి ముగ్గురికీ మూడైసులు కొంది. అల్లరిపెట్టినా కొనని అమ్మ అర్ధరూపాయి లెక్కన

అయిసు కొనివ్వడం సత్తికయితే సంతోషం కన్నా విచిత్రంగా వుంది. తల్లివేపు ప్రేమగా చూసి "అయిసు తినేసి, నీళ్ళు మోసి వంపేత్తాను" అడక్కుండానే అంది.

పిల్లలు ముగ్గురూ గడపలో కూర్చొని ఐస్‌క్రీం చప్పరిస్తున్నారు. అయిసు చుక్కలు జారి కిందపడి పోతున్నాయని ముగ్గురూ గలాసులు తెచ్చుకొని, అందులో పెట్టి, కారిన నీరు తాగి, కడుపు నిండిపోయినట్టుగ ముఖాలెడుతున్నారు. అది చూసిన గున్నమ్మకీ కడుపు నిండిపోయింది. పని చేస్తోందే గాని వారివేపే చూస్తోంది. ఇదంతా నాగమ్మ గ్రహించక పోలేదు. ముసల్దీ తక్కువది కాదు. వచ్చి అరుగు మీద వాళ్ళ పక్కనే కూర్చుంది.

"అనర్ర నాకివ్వరేఁ.... ఎవులు ఇత్తారో..." నాయనమ్మ మాటలకి సత్తి వులకలేదు, పలకలేదు. చిన్నాళ్ళిద్దరూ 'ఓఁ....' అని కళ్ళతో అన్నారే గాని ఒక్కరూ ఇవ్వలే. ఈసారి "కాకమ్మిస్తాదో.... పిల్లమ్మిస్తాదో...." ముసల్ది కళ్ళు మూసుకుంది. చిన్నోడు సిమ్మాద్రి కదలకపోయినా పెద్దాడు పెంటడు గబుక్కున లేచి నాయనమ్మ నోట్లో పెట్టాడు. ముసల్దీ కళ్ళు మూసుకునే పెద్ద గుక్కెడు లాగింది. ఐస్ చిన్నదయిపోయింది దెబ్బకి. పెంటడికి కోపం ఎత్తేదే కాని "మ్మో్మ... యమ్మో" నాయనమ్మ అరుపుకి గుడ్లు నిలేశాడు. ముసల్దాని పన్నొకటి ఊడిపోయింది. ఏమర్థమయిందో చిన్నోడు సిమ్మాద్రినుండి అందరూ నవ్వే.... నవ్వు!

పడి పడి నవ్వి కళ్ళు రెండూ తుడుచుకొని ఉప్పునీళ్ళు పుక్కిలించడాని కిచ్చింది గున్నమ్మ. పుక్కిలించి ఊసేక, మిగతా పళ్ళన్నీ కదుల్తున్నాయో లేదోనని కదుపుతూ కూర్చుంది ముసల్ది.

సత్తి చేతి పిల్లపుఁడు అంటే అయిదారేళ్ల క్రితం వరకూ అత్త అయిసుక్రీములు తినడం గున్నమ్మకి జ్ఞాపకమొచ్చింది. ఇప్పుడంటే పళ్లివీ కదిలిపోతున్నాయేమో గాని అప్పుడు అయిస్ ముక్క టపుక్కున కొరికేసేది. 'పల్లు పోగలవే.... వయిసిన్దావి వయిపోతున్నావే' మిత్తనోరి ఇకటాలు. ఇవన్నీ ఎలాగున్నా అప్పుడు మామూలయిసు ఐదు పైసలు, పాలయిసు పదిపైసాలు. ఇప్పుడో....? మునుపు నయాపైసాలు, రెండు పైసాలు, మూడు పైసాలు చెల్లనట్టే ఇప్పుడు ఐదు పైసాలు, పదిపైసాలు చెల్లడంలేదు. చెల్లడం లేదంటే వాటికి విలువ లేదు. పదిపైసలకి పూరా పలకపుల్ల రావడం లేదు... ఇదంతా ఈ మద్దికాలంలోనే, అయిదారేళ్ళలోనే. ఇంతకు మునుపూ రేట్లు ఏడాదేడాది పెరిగేవి, అయితే ఈ అయిదారేళ్ళలో పదేసి రెట్లు పెరిగాయి! తిన్నోస్తువునుండి తినని ఎరువుదాకా

అన్నీ అగ్గి పిరుమయి పోయాయి. అన్నీ మండిపోవడం తలచుకుంటే గున్నమ్మ మనసూ మండిపోయింది.

ఆకాశం మూసీసింది. చల్లటి గాలి వీధుల్లో బుగ్గిరేపి అరుగులమీద, ఇల్లలోకి కొడుతోంది.

"వానెలిపొస్తంది. అకాద తూరుపునేటి అవుపడ్డంలే" ముసల్ది సంతోషంలో పన్ను బాధ మరిచిపోయినట్టుంది. "కురిసీయమ్మ తల్లి... భగవంతుడా కరుణించయ్యా... " ఆకాశం కేసి ముసల్ది చేతులెత్తి ప్రార్థిస్తుంటే మనుమలిద్దరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఇల్లు సర్దడం అయిపోయింది గావాల ఇవతల కొచ్చింది నాగమ్మ. వెంటే గున్నమ్మ. అందరి ముఖాల్లోనూ ఒకటే ఆనందం...

సత్తి వీధిలో నిలబడి "తుంపర్లే" అంది, ఆకాశం కేసి నోరుపడుతూ.

"వొదినీ, మీకాసి ఈ మద్దిన వానలు పడ్డాయే?" గున్నమ్మ అడిగింది ఆకాశంకేసి వున్న చూపును తిప్పకుండానే.

" మీకాసేటి మాకాసేటి, ఎటుకాసీ సినుకుల్లేవు, సేల్లేవు, ఏటో వర్షాకాలం కూడ ఎండలు. కలికాలం ... అంతేని. లేపోతే దమ్ములెట్టీసి ఈపాటికి వుడుపులయి పోవాల. అలాటిది నారెండి పోయింది వర్షాలు కురిస్తే రొండోదపయినా ఎయ్యడానికి ఇత్తనాల్లేవు ..." నాగమ్మ చెప్తాంటే గున్నమ్మకి తనగోడే తను మళ్ళీ విన్నట్టయి ఏమీ మాట్లాడలేక పోయింది.

ఎక్కడో వురుములూ మెరుపులూ - ! చినుకులు వీధిలో నిల్చున్న సత్తిగుంట గౌనుని తడపలేక పోయాయి.

"బాతుగుడ్డిస్తాను బాదోబాదు - కోడిగుడ్డిస్తాను కొట్టోకొట్టు -" నోళ్ళు పీకిపోయాయేమో పెంటడు, సిమ్మాద్రి మరి అరవడం లేదు. ముసల్ది అరుగుమీదే అలాగే చేరగిలబడి పోయింది. ముంజూరంట సుక్కధార లేదు. కళ్ళాపి జల్లినట్టు వున్నాయి వాకిళ్ళు.

గాలి తేలిపోయింది. మబ్బులు తేలిపోయాయి. మేఘం తేలిపోయింది. చీకటి తేలిపోయింది. ఎండ మిగిలింది. నిప్పులు కక్కుతూ సూరీడు మిగిలాడు. ఆశ ఆశలాగే మిగిలింది. అడియాసలాగే మిగిలింది.

నోటి ముందల కొచ్చిన కూడు మళ్ళీ గభీమని ఎవరో తీసేసినట్లే ఆరోజంతా గడిచింది. ఆరాత్రీ దాలిగాడు రాలే. కాని కబురు తీసుకొచ్చాడు చిన్నమరిది దండాశి. జూట్‌మిల్లు మళ్లీ లాకౌట్ చేసారని, పనోళ్ళందరూ పనుల్లేక ఆడనే వున్నారని, ఈదపా

తాడోపేడో తేల్చుకోడాకి రడీగా వున్నారని చెప్పాడు. మేనేజర్లు లాకౌట్ చేసి, కలకత్తా ఎల్లిపోనారనీ చెప్పాడు. అసలు తనకింటికి రాడాకి వల్లకాలేదట, నెల్లిమర్ల ఎలితే పెద్దన్న కలిసి ఇంటికెలాగయినా ఎల్లమన్నాడని వచ్చేడట. బెంగేమీ వద్దని అన్న అన్నాడనీ చెప్పాడు.

"అన్నా దండాశీ, మీ యారకెత్తే(న్రా -సారా మరక రెండు నెల్లులో వుండదనీసి ఇన్నాను నీకూ పని ఇకన ఎలాగ -" నాగమ్మ నోట్లోమాట నోట్లోనేవుంది. అప్ప మాటలకి దండాశి పగలబడి నవ్వాడు. నవ్వి-

"ఓలప్ప నీయంత తెలివి తక్కువోలు ఈ లోకంలో లేరు" అన్నాడు. 'నీలోటోళ్ళే ఈ లోకంలో ఎక్కువన్నాడు. మంచినీళ్ళు లేకపోయినా మనుషులు బతగ్గలరేమోగాని, సారాలేకుండా ప్రభుత్వం సచ్చినా బతకలేదన్నాడు. అన్ని కోట్లుకి పాటలు పాడీసి, లచ్చలు పార్టీ ఫండులిచ్చీసి ఏపారం ఎత్తీడాకా? ఎదురు ప్రశ్న వేసాడు. ఇప్పుడు, పేకట్లు మానీసి సీసాల్లో సవక రకంది (ఐ ఎమ్ ఎఫ్ ఎల్) ఎక్కించాలని, తెలుగుదేశం వచ్చిన మొదట్లో ఎట్టిన సీసాలు ఇప్పుడు ఎదుకుతున్నామని, తనకింక టయిము లేద'ని వెళ్ళిపోయాడు.

దండాశి చెప్పిన విషయంకన్నా మాటతీరే నాగమ్మని ఎక్కువ ఆశ్చర్యపరచింది. అయినా ఇదేమి విడ్డూరం కాదనిపించింది. ఎందుకంటే దండాశి కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీల కేన్వర్సింగ్‌కు వెళ్ళిన్నుంచీ మారిపోయాడు. ఇప్పుడాడు మనిషిలాగా వుండడు, మనుషుల్లాగ బాధాపడడు. మంత్రాల్లాంటి మాటలు చెప్తాడు. మందులో మాత్రం ఎప్పుడూ వుంటాడు. మొదట్లో ఇంటిల్లిపాది వీధిలో పడ్డారు గాని ఫలితం లేక వదిలిపెట్టేసారు. ముసల్ది మాత్రం ఊరి రాజకీయాలే తనకొడుకుని పాడుచేసాయంటుంది.

దండాశి వెళ్ళిపోయినా వాడితో వచ్చిన సారాకంపు ఇల్లు కలయబెట్టింది. వాడు తీసుకొచ్చిన కంపెనీ లాకౌటు కబురు ఆ ఇంటిలోని మనుషుల్లో, మనసుల్లో జేజారు పెట్టింది. అలవాటయిన విషయమే అయినా ప్రతీసారి విషం కురిసినట్టుగే వుంటాది.

గున్నమ్మ మెదుడు మొద్దుబారిపోయింది. ఆరుమాసాలయిన పక్షవాతం వచ్చి కాలూ చేతులూ పడిపోయినదానిలా అయిపోయింది.

ముసల్దానికి జరగకూడనిదేదో జరుగుతున్నట్టుంది. లాకౌట్ మాటవిన్న ప్రతిసారీ ఆమె కళ్ళముందు ఎంతో చరిత్ర కదలాడుతుంది. ఆ చరిత్రంతా ఆమె కళ్ళ కన్నీట తడిసినా, రక్తంలో తడిచినట్టుగే వుంటుంది! తన భర్త రక్తంలో గిలాగిలా కొట్టుకోవడం తన గుండె కొట్టుకున్నంత బాగా అలికిడవుతుంది.

అప్పుడు పంతొమ్మిదేళ్ళ క్రితం ఇప్పుడు పెద్దపిల్లలిద్దరూ చేస్తున్న నెల్లిమర్ల కంపెనీలోనే పెనిమిటి పనిచేసేవోడు. అప్పుడిలాగే కంపెనీ మూసీడిం, కూలోళ్ళ బతుకులన్నీ ఈదిన బడిపోవడం - కలకత్తాకి ఆ కంపెనీ బావులు పారిపోవడం - తలచుకుంటే ఈరోజుకీ రోజులేమి మారలేదనిపించిదామెకి.

మిల్లు మూసీస్తే నోళ్ళు మూసీలేం కదా అనీసి అందరు బందు పెట్టినారు. మిల్లు తెరిపించాలని అందరొక కట్టయీసరికి, ఆ కట్టు తెంపలేక ఆ మిల్లు బావుల కంటే ముందల గట్టు ఏసీడానికి గవర్నమెంటే పోలీసుల్ని దింపింది. ఆకలితో అరిసినోడినల్లా అరదండాలేసీడానికే పూనుకుంది. అడిగినందుకు బ్రిటిషోళ్ళకు బాబుల్లాగ తయారయింది. పోలీసులు జరిపిన కాల్పుల్లో తన పెనిమిటితో ఐదుగురు రక్తపు మడుగులో తేలారు.

పెనిమిటిని తలచుకున్నప్పుడు తన్నుకొచ్చే ఏడుపు ముసల్దానికి ఈ దపా రాలే. ఇన్నాళ్ళ జీవితం ఏం నేర్పిందోగాని కొడుకు అదేస్థానంలోవున్నా - 'పోరితే గెలుపే' అనిపించింది. సారాపోరు కసింతయినా సాక్ష్యం పలికింది.

ముసల్దానికి పెద్దకొడుకుతోపాటు రెండో కొడుకు గుర్తుకొచ్చేడు. తండ్రి చావుతోటి ఆడికి మిల్లులో పనొచ్చింది. ఇల్లరికమెలిపోడంతో రాండోవోడికి పర్మినెంటయినా పెద్దోడికి ఇదిగో-అదిగో- అన్నారు గాని కాలే. రెండోవోడి మావలే అలాచేసారని ముసల్దాని నమ్మకం.

" అమ్మా తినేఁ - ఏటి అయిపోద్దే, ఆరువేలమందితోటే మనమున్నా-" అంటూ ముసలిదాని ముందుకు కంచాన్ని తోసింది నాగమ్మ. పిల్లలిద్దరూ అన్నాలు తిన్నారేమో వాళ్ళమ్మ చీర చెంగుకు మూతిపులిమి సత్తి వేసిన చాపమీద పడుకున్నారు. సత్తికి అన్నం పెట్టి గున్నమ్మనీ తినమంది. గున్నమ్మ సయించడం లేదన్నా ఇతం చేసుకు తినమందిగాని వగ్గలేదు నాగమ్మ.

పెనిమిటి కళ్ళముందు మెదిలి కంచాన్ని అలానే తోస్సి, గున్నమ్మ పిల్లల పక్కన పడుకొంది బొమ్మలా. నాగమ్మ మాటలు పనిచేయలేదు. ముసలిదాని మాటా అంతే!

ఆరాత్రి ఆకాశం నిండా చీకటి కమ్మింది. అక్కడక్కడా పట్టిన మబ్బులు తెల్లవారేసరికి చీకటి విడిపోయినట్లు విడిపోయాయేగాని చినుకుచుక్క రాల్లే!

పొద్దున్నే నాగమ్మ లోతుగడ్డ తనింటికి బయలుదేరింది. గున్నమ్మ రెండ్రోజులు వుండమని కోరింది. 'మగమనిషి ఒక్కడు, ఇంట్లో పిల్లలు చిన్నోళ్ళని, పనిచేసిన దక్షతలేదని వల్లకాదంది'. ఇక్కడా మగదిక్కులేదు, అల్లుడ్నోసారి పంపమని ముసల్ది మరిమరికోరింది.

బావదగ్గరకు వెళ్ళి బాగు కనుక్కొస్తాడని ఆమె ఆశ. నాగమ్మ అలాగేనంది. అరుగుదాటుతూ "పిల్లలు..." అని నసిగింది. తీసుకెళ్ళాలా వద్దా?! అని ఆమె తేల్చుకోలేక పోతోంది. ఇక్కడ పిల్లలు మాడిపోతారని తీసుకెళ్ళినా, అక్కడా తిండికి నమ్మకంలేకే తడబడింది.

ఎంతవరకు అర్థం చేసుకుందోగాని గున్నమ్మ అత్త పైటకొంగు పట్టుకు నిల్చున్న పిల్లలిద్దర్నీ వెనక్కులాగి " వుస్నీలేయే-నువ్వెళ్ళు -" అంది. నాగమ్మ కళ్లు నీళ్ళు చిమ్మడానికి సిద్ధంగా వున్నాయి.

అప్పుడే తవిటి వచ్చింది. వస్తూనే "ఏటి పొ్ద్యుమీదగాని ఎసరపెట్టీసి వచ్చినావే, ఇలా గొచ్చినావో లేదో అలగెలిపోతన్నావు, నా కొడుకు వండుకుంతాడ్లేయే, రెండ్రోజులుండే" అంది.

వూర్లో ఎవులికీ బాగోలేదని, విరోచనాలూ వాంతులూ అవుతున్నాయని ఈ దఫా వస్తే వుంటానని నాగమ్మ చెప్పింది.

"ఈ పిల్లమాటే, సర్లేగాని - అడ్డగ పొలాలకాసి ఆ అడ్డరోటుదాక దిగబెట్టీసి వద్దాం పదే గున్నా -" అని గున్నమ్మనూ తోడ్చుకొని నాగమ్మతో బయలుదేరింది తవిటి.

"పొలంకాసి సూసి ఎలిపోరాయండలాగ" ముసల్ది పురమాయించింది. పిల్లలు వస్తామని వెంటబడితే నాగమ్మ వాళ్ళచేతిలో చిల్లరడబ్బులు పెట్టి సత్తితో కోమటికొట్టు కెళ్ళిరమ్మంది. గున్నమ్మ కూడా ఇప్పుడే వచ్చేస్తామని నమ్మబలికింది. పిల్లలొదిలాక వీధి దాటుతుంటే ముఖ మెరిగిన వాళ్ళు మీకాసి పంటలెలాగున్నాయనీ అడిగితే ఇక్కడిలాగే అని చెప్పింది నాగమ్మ.

'కరువు పుట్టిపోతంది, మనలాటోళ్ళకి బతకరోజుల్లేవు-' గున్నమ్మ పైకే అందో స్వగతంగా అనుకుందో తెలీదు.

అప్పుడే గోర్జిలో బారికప్పిలి, రాజమ్మ, మాలచ్చిమి, ఎండోడు, లండడు, ఆదిగోడు ఇంకాల పిల్లలతోటి ఎవరెవరో బయలెలుతుంటే, నాగమ్మ తెలిసిన మొఖాల్ని పలుకరిస్తూ - 'రొడ్డతోటి బయలుదేరినారెక్కడికి' ఆశ్చర్యంగా అడిగింది. మూటాముల్లీతోటున్నారు వాళ్ళు.

బారికప్పిలి కళ్ళకు చేతులు అడ్డం పెట్టి చూసి " నా పాడుగళ్లు అవుపడవు. ఎవులే.... ఓలమ్మా ....నువ్వు పాపాయమ్మ కూతురివే.... బాగే?! ఏటడుగుతావమ్మీ ... సెక్కా ముక్కా వున్నోలే సెట్లలు పేరేస్తుంతే, ఎట్లెనోళ్ళము మాకెలగే? కూలుంతే కూడుంతాది.

అలాటిది వూర్లన్ని వల్లకాడయిపోయి ఒక వూడుపులు లేప్పోతే, దమ్ములు లేప్పోతే.... అసలుకి వర్షాలు గాని నీరులేక ఇత్తనం యివిరిపోయి సత్తుంటే - మట్టిని నమ్ముకొన్నాం కాదన్ను గాని... ఆ మట్టి గొడ్డుదయి పోయిందే... మా పిల్లాజెల్లా కళ్ల ముందలే సస్తే, మామూ గోడ్డోలుమయిపోకూడదనే... ఏవూరో పోతన్నాం... ఎక్కడ పని దొరికితే అదేవూరు....." అనీసి కర్రసాయంతో మనవడి భుజంమీద మరో చెయ్యేసి లేని సత్తువతో నడుస్తోంది.

బారికప్పిలి మాటలు విన్నాక మరేమి అడగబుద్దెయ్యలేదు నాగమ్మకి. వూరొదిలి పోతున్న వాళ్లని చూస్తే జాలికంటే ఎందుకో భయమే ఎక్కువై పోయింది గున్నమ్మకి. 'ఈ యాల మీరు రేపు మాఁవు' అంది తవిటి. ఆ మాటకు గున్నమ్మయితే మరింత తులుక్కు పడింది.

చిన్న పిల్లలు నడవలేమని ఏడుస్తూ గుర్రబ్బండెయ్యమని మొరాయిస్తున్నారు. గోని మూటల్తో పిల్లల్ని మొయ్యడం వారికి కష్టంగానే వుంది. దానికి తోడు రేవిటిఎండ చమడాలు తీస్తోంది. గున్నమ్మ, నాగమ్మ చిన్న పిల్లల్ని చంకన వేసుకు కొంత దూరం నడిచారు. తవిటి బారికప్పిలికి చేయూత మిచ్చింది. మాట మాట కలిపి మళ్లెప్పుడొస్తారో? అడిగింది తవిటి. 'అడుగు బయటెట్టినామంటే ఏటి సెపుతామే కోడలా' అని నిట్టూర్చింది అప్పిలి. 'ఇంక నాకే బతుకు బతకమంటావే?! ఆ బగమతుడు దిబ్బయిపోయిన బగమంతుడు నన్ను తీసూకెళిపోడు' తిట్టింది. అంతలోనే 'నీ మనవడి పెళ్ళికి భోజి తినడాకి రానే, అంతబేగి సచ్చిపోతానే' నవ్వింది. 'సప్పటి పప్పులవింతెయ్యాల' ఆ రోజుకోసం ఎంతగా తలుచుకుందోగాని కోరిక బయటపెట్టింది.

" మాలచ్చిమీ మీ అప్పిలత్త సచ్చిపోతే నీరట సప్పటి పప్పు ఎడితే సేన, వంటా వార్పులక్కర్లేదు" నవ్వుతూ అంది రాజమ్మ.

"అడుగెయ్యండర్రా, సేన ఇకటాలు" ఎండోడి మాటతో అంతా అడుగులు గబగబా వేశారు.

పొలం కాసి తిరిగిపోయిన గున్నమ్మ, నాగమ్మ, తవిటీ దూరమవుతున్న వాళ్ళకేసి చూస్తూ చేతులూపుతున్నారు.

ఎందుకో ముగ్గురి మనసులూ భారమయిపోయాయి. కొద్దిసేపు ఎవరూ మాట్లాడుకోలే. వాళ్ళ దృష్టంతా ఎండిపోయి చుట్టుకెళిపోతున్న వరినారు మీదికి పాకింది. పచ్చగా వుండాల్సిన నారు పసుపురంగులోంచి ఎండి బూడిద రంగులోకి మారిపోయింది. అన్ని పొలాలు అంతే.

ఎవరెవరో నారుమళ్ళలో పశువుల్ని మేపుతున్నారు. మరి నాలుగయిద్దినాల్లో పూర్తిగా చచ్చిపోనున్న నారుని పశువులు తినడం నాగమ్మ సయించలేక " వరినారేని కలాగ మేపతన్నావురా?'' బక్కల గుంటడ్ని అడిగింది.

"మామయ్య మేపీమన్నాడు. ఒట్టిన పోతుంది గదా బక్కలయినా తింతాయనీసి. ఆకాద అలాగ సూసి ఆ మడులన్నీ వట్టిన పోనాయి '' బక్కల గుంటడు అవతలివేపు చెయ్యి చూపించాడు.

మడుల్లో మంట పెట్టినట్టు నారంతా ఎండుగడ్డి కర్రల్లా నేలకు అంటుకొని నేల్లోనే కలిసిపోతున్నాయి.

" మనూరే కాదే, సతివాడ, గొర్లిపేట, తంగుడుబిల్లి, సారిపల్లి, జరజావుపేట, పూతికపేట... అంతలెక్కా ఇలగే.... ఈ సంమత్సరమంతెల గడుస్తాదో ....'' తవిటి చూపు తిప్పకుండానే, నడక ఆపకుండానే అంది.

కొద్ది అడుగులు వేశాక గున్నమ్మ అలాగే నిలుచుండి పోయింది. తమ పొలాన్ని చూసాక ఇంకటు అడుగు పడలే. మనసంతా కలచివేసినట్టయి గట్టుమీదే కూచుండి పోయింది. నాగమ్మ పొలంలోకి దిగింది. తవిటి గట్టుమీద నుండే చూస్తోంది.

వున్న ఎకరా మెట్టు ఏనికి పనికిరాదనీసి, పల్లం ఎకరామీదే ఎక్కడలేని ఆశలు పెట్టుకుంది గున్నమ్మ. ఎకరా వరిమీద గరిసెడు (ముప్పయి పుట్లు) ధాన్యం అయితే సంవత్సరం పొడుగూ సాలకపోయినా, ఆపదలకమ్మీసి మల్లా కొనుక్కున్నాకంత బొత్త(తృప్తి)గ వుండీది. వుంటుందని వూడుతుందని తెలీని జూట్ పనిమీద మగ మనిషితో పాటు తనకీ ఆశలేదు. వున్న ఆశల్లా నమ్ముకున్న మట్టి మీదే! అదీ జూదమయిపోయింది.

" ఓలి గున్నమ్మా ఏటిలగ సతికిలబడిపోనావు, మీ వొదిన్ని ముందల దిగబెట్టీసి వస్తుమ....ప....' తవిటి గున్నమ్మ భుజం మీద చెయ్యివేసి తోసింది. గున్నమ్మ ప్రాణంలేనట్టే కదిలింది. నాగమ్మ గట్టు ఎక్కి పక్కనే కూర్చుంది.

ఎవ్వరూ కొద్దిసేపు ఏమీ మాట్లాడుకోలేకపోయారు.

దూరంగా డప్పులు. ఎవరో పొలంలో పసుపు నీళ్ళు చల్లి కోడిని కోస్తున్నారు. ఆకాశం కేసి తిరిగి దండాలు పెడుతున్నారు. "వానళ్ళు కురవాలి వానదేవుడా - మా వరిచేలు పండాలి వానదేవుడా'' అని పిల్లలు అరుస్తున్నారు.

ఎండ కార్తీల్లోలాగ కాల్తోంది.

గున్నమ్మ పరిస్థితి చూసి నాగమ్మే అంది. "ఒదినీ నీ వింటికెళ్ళు. తవిటప్పా ఎల్లండి. ఎంతసేపు, మరి నాలుగడుగులే" అంతకు మించి ఆ పరిస్థితుల్లో ఏమి మాట్లాడాలో ఆమెకీ చేతకాలేదు.

'నాలుగడుగులే గదా మీమూ వస్తాంపదా' అంటూ తవిటి గున్నమ్మ చెయ్యిపట్టుకు ఎత్తి ముందుకు నాగమ్మతోపాటే నడిచింది. నాగమ్మ వారించబోయి వూరుకుంది. కొద్దిదూరం నడిస్తే చంపానది వచ్చింది. నదిలో ఇసుక తప్పితే రైతుల కళ్ళలో వున్నన్నయినా నీళ్ళులేవు! వర్షాకాలంలో ఇంతకు మునుపయితే నీరు పారి అదొక సందడిగ వుండీది. ఇప్పుడు గడ్డకట్టుకు పోయినట్టు ఏ శబ్దమూ లేదు.

ఎవరి ఊపిరి వారికే పాముబుసలా వినిపిస్తోంది. నది పక్క ఊర్ల వాళ్ళెవరో కడుపు నొస్తే చెంబులతో నీళ్ళు పట్టుకు రావలసి వచ్చినందుకు తిట్టుకుంటున్నారు.

"మీరికన వుండిపోండి. మళ్ళి ఎనక్కి నడిసి ఇంటికెళ్ళి అగ్గిలేసి వంటలు ఎత్తుబెట్టీసరికి సూరీడు నెత్తికొచ్చీగల్డు ఎల్లండి, మరెంత నాలుగడుగులు పట్టించి ఏస్తే రోటు" అని గున్నమ్మ తవిటిలను ఆపేసి, నది ఆవలిగట్టు ఎక్కింది నాగమ్మ. ఎక్కుతూ "వొదినీ నువ్వే ఇంటికి ఆడదిక్కూ మగదిక్కూ. దయిర్యం సేసుకుండు. పిల్లలు జాగర్త. మీయన్నని పంపిస్తాలే"మాటల్తోపాటే మనిషీ దూరమయింది. కనుమరుగయాక్కానీ కదల్లేకపోయారు గున్నమ్మా తవిటీ.

కొంతదూరం వచ్చిన తవిటి పేడకల్లు చూసుకు వస్తానని బక్కలమంద వైపుకి తిరిగిపోయింది.

గున్నమ్మకి ఎందుకో ఒంటరి అయిపోతున్నట్లు అనిపించి భయమేసింది. అంతలోనే దయిర్యంగుండన్న నాగమ్మ మాట గుర్తుకువచ్చింది. అప్పుడు నాగమ్మ ఒత్తి చేతుల్తో వెళ్ళిపోవడం తలపుకొచ్చి నొప్పనిపించింది. ఇంతకు మునుపయితే వున్నంతలో ఆడపిల్లనీసి పెసలో, మినుములో, ఏదీలేకపోతే తూమడో దామడో వేరుసెనక్కాయాలో, లేదు అంటే సీసాడు వేరుసెనగ నూనయినా కట్టేది. నూనె తలంపుతో పాటే మెట్టులో వేసిన వేరు సెనగ పంటా గుర్తుకువచ్చింది. సుట్టికెళ్ళిపోతున్న వాటినీ చూడ్డం ఇష్టంలేక పోయింది. మనసు చింపుకున్నట్టయి ఇల్లు చేరుకుంది.

ఆ రాత్రికీ మగడు దాలిగాడు రాడని తెలిసి అన్నం తొరపకుండా ఎదురు చూస్తూనే కునుకుతీసింది.

మరసటిరోజు పొయ్యిమీదకు ఎసరు ఎక్కించినా బియ్యం నిండుకోవడంతో ఏదో కనపడకుండా ముసురుకున్నట్టయి తల భారమయింది గున్నమ్మకి. మాటా మంతీలేని తల్లిలోని మార్పు సత్తికి అస్పష్టంగా అర్థమవుతోంది. మిగతా పిల్లలిద్దరూ నాన్నొస్తే బాగున్ను అనుకుంటున్నారు.

వీధిలో అలికిడయి అరుగుమీద కొచ్చింది గున్నమ్మ. గుంపుగా గొల్లు గొల్లు గోలగావున్న జనం. మనిషోమాట మాట్లాడుతున్నారు. కొద్దిసేపయాక అర్థమయింది. చేలో పనుల్లేక కూలీలెక్కువయి, కూలీ రేటుమాత్రం మగవాళ్ళకి పది, ఆడవాళ్ళకు ఆరురూపాయలకి తగ్గిపోయాయని. ఒకపూట తిండికే రోజుకూలీ లేదని, చాలదని కుర్రోళ్ళు కేకలేస్తున్నారు. పనుల కెళ్లొద్దని కూడా తీర్మానం చేసుకుంటున్నారు.

తవిటొచ్చి గున్నమ్మని ఇంట్లోకి తీసుకెళ్ళి రహస్యం చెప్పినట్టు 'ఇది ఇన్నావా' అని నోటి మీద వేలేసుకుంది. గున్నమ్మ అడగక ముందే చెప్పింది. "ఇందరళ్ళులను సూసినాముగాని ఇలాటళ్ళున్నెక్కడ సూడలేదు, సూడను. మాలచ్చిమి కయినా ఇది ఎన్నో పురుడు? మూడోపురుడు. పోనీ, అయినా కన్నోరి దగ్గిర కట్టలు బలిసిపోతన్నయా? ఆ అళ్ళుడు బావెప్పుడూ సమత్సరానికి తొమ్మిది నెళ్ళూ ఇక్కడే. ఆడలంజను ఎక్కడినుండి తీసుకొచ్చిపొయ్యనే. అప్పటికీ ఆ లచ్చింగుంట ఇక్కడే తినుకొని కూకుంతే బాగోదని అనీసింది. అత్తిరి అంత మాటంతవా అనీసి తాగి సెలిపొచ్చి వొట్టి మనిషి కాదని సూడకుండా బీపొంచి గభీగభీమని గుద్దేన్డు. నాకు రిమ్మా మరేటి? నా నొప్పినానా? మొగుడు సచ్చినముండని నావల్ల కాదనీసినాను..." అని గున్నమ్మ వేపు చూసి పొయ్యిలోకి అగ్గివేసి మళ్ళీ అంది "ఏటంతన్నాడంతే పనీలేదు, కరువట కరువు. దేశమంతా కరువే... అలగనికుంతెలగవుద్ది" లచ్చిమి పిలుపుతో తవిటి మళ్ళీ వస్తానంటూ వెళ్ళిపోయింది.

కరువు .... కరువు .... కరువు ...

చుట్టూ తిరిగి కరువు దగ్గిరికే వచ్చింది కథ !

అప్పుడే ముసల్దొచ్చింది. వస్తూనే "అనే గున్నా! అందరు ఇత్తనాలకి ఏపగించు కుంతున్నారు. మళ్ళీ దమ్ములకి ఇదవతన్నారు. ఈపాలయినా సినుకులుపడితే మల్లా నారు లేస్తాదని ఆశ. లేపోతే సినుకులు పడినా ఏనికీ పనికి రాకండ మిగిలిపోతాము..." అంది.

గున్నమ్మ గుండెలో రాయి పడింది. 'తొలిదపా ఇత్తనాలకే పళ్ళిరగరుసు కోవడమయిపోయి పది సుట్లూ పదిమంది సుట్టూ తిరిగితే గాని ఇత్తనాలకు దినం తీర్లే

....' ఆలోచనలెలావున్నా వంటలాగే వదిలేసి తెలిసిన వారి ఇల్ల చుట్టూ తిరిగింది. సావుకార్లు, పెద్దరైతులు తప్ప చాలామంది తమలాటి మొండి చేతులవాళ్ళే! సావుకార్ల దగ్గిర అగ్గి పిరువు, పెద్దరైతులు ఒట్టప్పుడంటే ఎన్నో కొన్ని అమ్మేవోలు కాని కరువొచ్చి ఆలూ కాదనీసినారు. గున్నమ్మని చూసి మరింత మంది అప్పులకెగబడ్డారు. ఆకాశంవంక ఆశగా చూసారు.

మండల వ్యవసాయాధికారి విత్తనాలు ఇస్తాడని మాటెలా పుట్టిందో మంటపుట్టినట్టే వూరంతా అంటుకొని పొగలా జనం పోగయ్యారు.

మండలాఫీసుని చుట్టిన జనాన్ని చూసి ఆయన చాలా బాధపడ్డాడు. కలికాల మన్నాడు. కరువు కోరల్లో ఇరుక్కున్నారన్నాడు. కాని విత్తనాలు లేవన్నాడు. సరఫరా కాలేదన్నాడు. గవర్నమెంటు గిడ్డంగుల్లో వుంచిన ధాన్యం విత్తనాలు గోడౌన్లు బాగోలేక కుళ్ళిపోయాయన్నాడు. ఎలుకలు తిన్నాయన్నాడు. ఏనుగుల్లా బలిశాయన్నాడు. ఎన్నీ లేవని ఎంతమందికి పంచనని ఎదురుప్రశ్న వేసాడు. గవర్నమెంటుకు కాగితం రాస్తానన్నాడు. ఎరువులయితే ఇపుడున్నాయి. సబ్సిడీ మీద తీసుకెళ్ళండన్నాడు.

పేపరోళ్ళుగావాల ఏదో రాసుకున్నారు. పేదలు తమ ఆశలకు తలుపులు మూసుకున్నారు. ఇల్లు చేరుకున్నారు.

విత్తనాలకు తిరిగే గందికలో దిసా చేస్సిందనేమో "బాప్ప ఆల వూరు ఎలిపోతాం" అన్నారు చిన్నాళ్ళిద్దరూ. ఏమిరా గున్నమ్మ మాట నోట్లోనే వుంది. 'ఇక్కడేమి బాగులేదు' అన్నారు మళ్ళీ "పొండిరా పొండి ..." అని గున్నమ్మ పిచ్చి దానిలా ఏడ్చేసింది. పెంటడూ సిమ్మాద్రీ చెరోవైపు చేరి తల్లి కళ్ళు తడుస్తూ "ఎళ్ళంలే" అన్నారు.

గున్నమ్మ మెదడూ మనసూ శరీరం మొద్దుబారిపోయాయి.

ఆ రాత్రి గున్నమ్మ పిల్లల్ని తడుముతూ పడుకుంది. పడుకొని రెప్పలు మూసుకున్నా నిద్ర పోతున్నట్టో మెలకువగా వున్నట్టో తెలీలేదు. మరి ఆ పరిస్థితుల్లో వచ్చింది కలో, భ్రమో ఏమోగాని తులుక్కుపడి లేచి కూర్చుంది. చెమటలు పట్టాయి. బారికప్పిలి, రాజమ్మ, మాలచ్చిమి, ఎండోడు, లండడు, ఆదిగోడు అందరితో పాటే తనూ దాలిగాడూ పిల్లలూ ఊరువిడిచి పెడుతున్న దృశ్యం... కలిచి వేస్తోంది. భయంగా పిల్లల్ని మరింత దగ్గరగా గుండెల కదుముకుంది. మరి తెల్లవార్లూ నిద్రపట్టలే!

తెల్లవారిన్నుంచి పొద్దుపోయిందాక విత్తనాల వేట! దాంతోనే నాల్రోజులు గడిచిపోయింది. వరి నారు చచ్చిపోయింది. అందరూ వర్షాలకేసి చూస్తూ విత్తనాలు దొరికినా దొరక్క

పోయినా వేరే గత్యంతరం లేక మళ్ళీ దమ్ములు పడుతున్నారు. ముసల్ది కొడుకికి కనిపించినోళ్ళందరి చేత కబురు పంపుతూనే వుంది.

బియ్యం నిండుకున్నా నూకలజావ, సోడిపిండంబలి. అదే మరోపూటకు బెల్లం కాల్చిన అట్లు. బెల్లం లేకపోయినప్పుడు తోప. తవిటి నాల్గూములు బియ్యం అప్పిచ్చింది. ఎంతో కొంత గైబుచ్చుకెళ్ళే వీలయింది.

పండగకు తియ్యలేదని పుట్టిన రోజుల కయినా కొత్త బట్టలు చిన్నాళ్ళిద్దరికీ తియ్యాలని, అలాగే ఎదుగుతున్న సత్తికి గుడ్డముక్కల్లేవని దాలిగాడు దాచమనిచ్చిన నూటయాభై రూపాయలు పెట్టి పొలం మళ్ళీ దమ్ము పట్టేపని పురమాయించింది గున్నమ్మ.

దమ్ము పూర్తయిన రాత్రి దాలిగాడొచ్చాడు. దాలిగాడొచ్చిన రాత్రే ఒక మోస్తరుదయినా వర్షమూ పడింది. కుండనిండా కూడయినట్టు కడుపునిండా తిన్నట్టు తృప్తిగా తోచింది గున్నమ్మకి. ఊర్లో అయితే అడగక్కర్లేదు సంబరమే!

పిల్లలు తండ్రి దాలిగాడ్ని విడవక పోవడం వల్ల ముసల్ది మధ్య మధ్యలో కదుపుతూవున్నా మగనితో మాట్లాడ వల్లకాలేదు గున్నమ్మకి. ముసల్ది చెప్పదల్చుకున్నదంతా సత్తి మద్దిమద్దిన దూరిపోయి పూర్తి చేసింది. దాలిగాడు ఒకటి రెండు సార్లు గున్నమ్మని ఏ విషయమో అడిగినా అరకొరగా మాటలాడిందే గాని తృప్తిగా గుండెలో భారాన్ని దించుకోవాలని వున్నా దించుకోలేకపోయింది. తినీ తినక లాకౌటు గొడవల్లో పడివచ్చిన మనిషికి మరిన్ని బాధలు చెప్పి విసగ్గొట్టడం ఇష్టం లేకపోయింది.

ఆ రాత్రి తమిద్దరి మధ్యా పిల్లలు నిద్రపోతున్నప్పుడు దాలిగాడు 'గున్నమ్మా' అంటూ పిల్లల్ని నిమిరాడే గాని పెళ్ళాన్ని దగ్గరకు తీసుకోలేకపోయాడు.

ఆగిపోయిన పిల్లల చదువులు, ఆశపోయిన వ్యవసాయపు పంటలు, మూసుకుపోయిన జూట్ మిల్లు తలుపులు ఒకటొకటి ఒదిగి పోతున్నాయేగాని ఒకరిలో ఒకరు ఒదిగి పోలేదు.

విత్తనాలు కుదరలేదంది గున్నమ్మ. ఇన్ని రోజులైనా లాకౌట్ ఎత్తలేదన్నాడు దాలిగాడు. పిల్లల చదువులో అంది గున్నమ్మ. వేరుసెనగకి తెగులో అన్నాడు దాలిగాడు. బియ్యం నిండుకున్నాయి అంది గున్నమ్మ. జీతాల్లేక వడ్డీ కట్టక కొత్త అప్పు పుట్టలేదన్నాడు దాలిగాడు. ఎండలు మండిపోతున్నాయి అంది గున్నమ్మ. వర్షాలు కురవడంలేదు అన్నాడు దాలిగాడు.

"ఇండెట్టి కురిసేన్నని గాల ఆగిపోయింది వాన...." గొణుక్కుంటూ ముసుగులో మక్క సలుపుతో మూలిగింది ముసల్ది.

మాగన్ను పట్టిందేమో గాని గున్నమ్మ పిలుపుకు దాలిగాడు 'ఊ' కొట్టలేదు. గున్నమ్మ బలవంతాన కళ్ళుమూసి నిద్రపోవడానికి చాలాసేపు గింజులాడింది.

తెల్లారేసరికి ఊరంతా జాతరే. విత్తనాల కోసం వుమ్మిరి తిరుగులే. దాలిగాడు తన మేనత్త కొడుకు రాంబద్రపురం నుండి కబురుచేస్తే విత్తనాల కోసమని పంచీకట్టాడు. పంచీకి జేబులేనట్టే కొనడానికి డబ్బులూ లేవు. ఊర్లో అప్పు పుట్టలే. తనఖాకి తల్లి అడ్డుగమ్మిలూ కొనసెవ్వులూ మిగల్లే. గున్నమ్మ పుస్తిలూ జువంకాలూ పద్దునుండి వీడలే. అగుపడిందల్లా సత్తిగుంట ముక్కు బేసరి! సత్తి ఏడ్చింది. ఇవ్వనంది. గున్నమ్మ నచ్చజెప్పింది. దాలిగాడు కొత్తవి కొంటానన్నాడు. మొండిపట్టు వీడలే. ముసల్ది తిట్టడం మానలే. కడకి దానీపు పిట్లగొట్టాకా తప్పలే. మేక పిల్లను పట్టుకున్నట్లు సత్తిగుంట కాళ్ళూ చేతులు పట్టీసి తల కదలకుండా తిప్పకుండా నొక్కేసి కదిల్తే రక్తమొస్తాదని జడిపించీసి బంగారం ముక్కుపుడక తీస్సినారు. ఆ బొక్క (కన్నం) లో చీపురుపుల్ల ముక్క యిరిసి దోపేసినారు.

తనఖాకి పెడుదుమంటే వందకూడా ఇవ్వలేనన్నాడు షరాబు. అమ్మితే నూట అరవై రూపాయలు వచ్చింది. అప్పటికి సూరీడు నెత్తికెక్కాడు. గున్నమ్మ వడ్డించిన పకాలన్నం తిన్నాననిపించుకొని ఛార్జీలకు చేబదుళ్ళు వాడి బావమర్ది దగ్గరకు చేరుకున్నాడు. బావమర్దితో ఆ పూటంతా తిరిగి ఎలాగయితేం విత్తనాలు సంపాదించాడు.

పందుం (పది కుంచాలు) మసూరి విత్తనాలు రెండొందల పాతికి రూపాయలుతోపాటు సర్కారు బావుల చేతులు తడపడానికి పాతిక, టీ, టిఫిన్లు పది, మొత్తం రెండొందల అరవై. బావమర్ది వంద సర్దేడు.

చీకటేలకు దాలిగాడు విత్తనాలతో ఇల్లు చేరాడు. విత్తనాలు దొరికినందుకు గున్నమ్మా, ముసల్దీ సంబరపడిపోయారు. రేటు తెలుసుకొని సతకల్లబడిపోయారు.

"ఈ మసూరిత్తనాలే మనం నాలుగు మాసాల ముందల అమ్మేతపుడు పందుం వంద రూపాయలు, తప్పితే యింకో పాతిక అటు. అంతేగాని ఒక్కపాలి యింత పిరుమా? పుట్టీ (ఇరవై కుంచాలు) రేటుకి పందుమా? ఆలింట్ల పీనుగెల్ల...." అందుకోబోయింది గున్నమ్మ.

"గవర్నమెంటు అమ్ముతున్న రేటే అది, ఆలకిచ్చింది పాతికే. బాగుంది మాకాడ మీరు కొన్న రేటుకి విత్తనాలు ఇపుడు అమ్మతోటికి 'తేడా ఇంతోటా' అనడిగితే బావయితే కోపమయిపోండు. దొరకడమే సేనసేనన్నాడు. ఆ బావులయితే విత్తనం మేం బాగుసేస్తాం అనీసి అనేనాడు..." అంటూ జరిగింది చెప్పి శాంతపరిచాడు దాలిగాడు.

ముసల్దీ అంతా మాయమాటలు, మాయ ప్రపంచం అంది. సత్తి గుండెలోని బాధంతా విత్తనాలుగా మూటకట్టినట్టుంది.

జూట్‌మిల్లు లాకౌట్ కాబట్టి అక్కడే వుండి తీరాలని, విత్తనాలు చల్లించమని మళ్ళీ వీలున్నంత తొందరలో వచ్చేస్తానని నెల్లిమర్ల బయలుదేరబోయాడు దాలిగాడు.

"బేంకోళ్ళు వొస్తే ఏం సేతును?" బితుకుతో వెంటాడుతున్న భయాన్ని వెళ్ళగక్కింది గున్నమ్మ.

"ఎంతన్నారు?" అడిగాడు దాలిగాడు.

గున్నమ్మ గూట్లో దాచిన చీటి చూపించింది. దాలిగాడు పాము కరచినట్లు గుడ్లు నిలేసాడు. గడచిన కాలమంతా కళ్ళముందోసారి కదలాడింది. పదేనొందల అప్పుకి ముడుపులు మూడొందలిస్తే ముఖంమీద కొట్టడం ఇంకా జ్ఞాపకముంది. అయిదొందలిస్తే గాని అతని కోపం పోలే. పదేనొందలకి చేతిల పెట్టింది వెయ్యే! ఆ వెయ్యి ఈ నాలుగయిదేళ్ళలో రెండువేల ఒక వందా అరవైరూపాయలయింది.

అందుకే ఈ ఏడాదీ వ్యవసాయ పరపతి సంఘాలు అప్పులిస్తామని అన్నాసరే ఆమడ దూరం పారిపోయాడు. వేతన కార్యదర్శులు, ఇంకా సూపర్‌వైజర్లుదే రాజ్యం. బ్యాంకు రుణాలకు వీళ్ళంతా బ్రోకర్లు. పరపతీ పలుకుబడీ వున్నోళ్ళకే అన్నీనూ! అప్పు దొరక్కపోతే లేదని అదవా అడుగుదామని నిలబడినా 'ఇది నా ఒక్కడికే కాదు, కిందినుండి పైవరకూ వాటాలేస్తే ఏమీ మిగల్దు' అని దుఃఖపడతారు. వాళ్ళ బాధలూ ఒలకబోస్తారు.

"అన్నా దాలిగా, ఏటలగ నిలబడి పోనావు. ముసల్దాన్నయి నాకు మతి లేకపోతంది.అనే గున్నా.... అదీ అంతే, ముందరేడు వెయ్యి రూపాయలు కట్టినట్లు గున్నావు?" ముసల్దీ అనేసరికి కోడలూ కొడుకూ ఇద్దరూ గక్కుర్రు మన్నారు. చీటీలేసి ఎత్తిన సొమ్ము బేంకోడి బొడ్డుమీద పొయ్యడం గుర్తుకొచ్చింది. అంతా కాక పోయినా ఎంతకొంత తీరుద్దనే ఆ పని చేసారు.

"నాకూ మతిలేదు. వెయ్యి ఎలాగ కట్టీనాం కదా, మిగతా వెయ్యి, ఆపైన చిల్లర ఎంతయితే అంత ఒక్క ఏడు గడువు అడుగు. ఈ దపా కట్టకపోతే ఆలిష్టమొచ్చినట్లు సెయ్యమను" అంతకు మించి చెప్పాల్సింది కాని, గున్నమ్మకు తెలియందీ తనకు తెలిసిందీ లేదని మరేమి అనలేకపోయాడు దాలిగాడు.

సరీగప్పుడే వీధిలో డప్పు!

ఏదో ముప్పనుకుంటూనే చేరారందరూ. డప్పు ఆగాక ప్రెసిడెంటు నోరు విప్పాడు. అప్పు తీర్చెయ్యమని అంటాడేమోనని నోళ్ళు వెళ్ళబెట్టారందరూ. కాని బేంకు అప్పు గురించి ఆయన ఏమీ అనలేదు. భూమిశిస్తు ఎవరూ కట్టలేదని, గవర్నమెంటు భూమి సీలు చేస్తుందని, కట్టీయండని అన్నాడు.

ఎవ్వరినోట్ల నాలికలాడలే!

"శిస్తు కట్టనోళ్ళందరూఎమ్మార్వో ఆఫీసుకి హాజరవ్వాలని కబురెట్టినారు. అయినా దిక్కుమాలింది శిస్తూ కట్టకపోతే మనూరికి ఎంత చిన్నతనం. పరువు పోతంది. జమాబందీ లెక్కలపుడు తలెత్తుకోలేకపోన్ను'' చికాకుపడ్డాడు ప్రెసిడెంటు.

"కరువు కదండీ...." ఎవరిదోమాట.

"ఏట్రా కరువు? అయినా ఎప్పుడు లేదురా కరువు? ఎంతరా ఎకరాకి సంవత్సరానికి పాతికో ముప్పై.... ఆ లెక్కన....'' ప్రెసిడెంటు మాట పూర్తి కానియ్యలేదు. తవిట అందుకుంది.

"గోకుర్ర పాలిచ్చిన గోవుకి, తాగిన గెంజిలో గుక్కెడు తీసి ఎట్టడం దరమ్మే! పాలివ్వకపోయినా వున్నపుడు ఎట్టడమూ దరమ్మే, లేనపుడో.... ఆ గోవు కొమ్ముల్తోటొచ్చి కుమ్మేస్తానంతే మాత్రం వున్నప్పుడిలాగే ఎట్టమంతెలగ? అప్పుడు కొమ్ములిరిసేడిమే ధరమ్ము!!''

"అయితిపుడు ఎవులికి కొమ్ములు మొలిసిపోనాయంతావే ముసిలి ముండా'' తవిటి మాట తూటాలా దిగబడిందేమో తిడుతూనే అడిగాడు ప్రెసిడెంటు.

"ఏలినోలికి. ఎవులికి నొప్పొచ్చిందో ఆలకి. నీతోటి నాకు జగడమేల. తొండలు తిరిగిన బూమికీ శిస్తు కట్టమంతే నాను అన్నాను గాని....'' తవిటి జవాబిచ్చేక ప్రెసిడెంటు తన వాదాన్ని పొడిగించలేదు. పత్రం తీసి పేరు పేరున శిస్తు చదివాడు. రేపు ఎమ్మార్వో ఆఫీసుకొచ్చి కలవమని ఇంక అక్కడోక్షణం కూడా నిలబడలేక పోయాడు.

గుడ గుడమంటూ మాటలు. గుంపులు గుంపులుగా మనుషులు. గుడగుడ మని మబ్బులు. మాటలేకమౌతున్నాయి. మనుషులేకమవుతున్నారు. మబ్బులు తేలిపోతున్నాయి.

'అందరితోటీ మనమున్నా' అది ధైర్యమో తెగువో మాటనేసి దాలిగాడు మిల్లుకి వెళ్ళిపోయాడు. ఏదో భారమంతా తనకే అప్పగించి మొగడు వెళ్ళిపోయినట్లుగా వుంది గున్నమ్మకి.

మరుసటి రోజు ఊరుతోటి ఎమ్మార్వో ముందు వాలారు. గున్నమ్మ గుండె కొట్టుకోవడం మునుపులా లేదు. అందరితోటి వున్నందుకేమో ఏదో ధైర్యం తెలియకుండానే ఆవహించింది. ప్రెసిడెంటు ఏమి చెప్పాడో ఎమ్మార్వో అసలు విషయం తోటే మొదలుపెట్టాడు.

"కరువొచ్చింది కాదన్ను. కరువు ఈవాలుంటుంది, రేపు పోతుంది. రూల్స్ అలాకాదు. ఎప్పుడూ వుండేవి. కాబట్టి భూమి శిస్తు కట్టే తీరాలి. కరువని కట్టమన్నార్త. పన్నులు అలా ఎగెయ్యడానికి వీల్లేదు. కరువు కాలంలో శిస్తులు 'రద్దు' అన్నది ఎప్పుడూ లేదు! 'నిలుపు' చేయడం మాత్రమే వుంది. తరువాతయినా మొత్తం కట్టాల్సిందే...."

"కట్టించుకున్నా జాలి వుందన్నమాట. ఆహా" ఎవరో కుర్రోడి మాట . ఆ మాటకు కొందరు నవ్వారు.

"మరిది కరువు కాలమని మీరే అన్నారు. శిస్తు నిలుపయినా సెయ్యండి" ఎవరో ముసలాయన ముందుకొచ్చాడు. జనమంతా ఆసక్తిగా చెవులు రిక్కించారు.

"కరువు అని నువ్వన్నా, నేనన్నా అది కరువు ప్రాంతంగానో కరువు జిల్లాగానో చెల్లదు. గవర్నమెంటు అనాలి, గుర్తించాలి. అందుకు అవసరం మేరకు పరిస్థితులను సమీక్షించడానికి పరిశీలకుల్ని పంపిస్తుంది. వాళ్ళు రిపోర్టు ఇస్తారు. ఆ రిపోర్టు ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది....." ఎమ్మార్వో ఇంకా అర్థమయ్యేట్టు చెప్పేవాడేమో గాని తవిటి వొప్పలేదు.

"సేన్లే అయ్యా.అవన్నీ అయ్యిపాటికి మావు కాటికెలిపోడ మెలగున్నా మీ రొప్పుతారా? మా ఇల్లమీద పడి దొరికింది దోసుకెలిపోయి జప్తులకి పిలరూ! అన్నట్టా బేంకోళ్ళే పక్కన పిశాచాల్లా పడ్డారు. మీరు రండి. మీ రెండు పక్షాలల్ల ఎవులికెక్కువ బలముంతే ఆలే వొట్టుకు పోదురు. లేకపోతే కలిసి ఓటా లెసుకుందురు ..." అనేసి, తవిటక్కడ నిలబడలే. తలొంచుకొంటూ ఎవ్వరికోసం చూడకుండా నడవడం మొదలు పెట్టింది.

ఎమ్మార్వోకి ఏమి అంతు చిక్కలే. నోటంట మాట రాలే.

"విజయనగరం జిల్లాను కరువు జిల్లాగ ప్రకటించాలి. బేంకు రుణాలు, భూమి శిస్తులు రద్దు చెయ్యాలి"

"కరువు జిల్లాగ ప్రకటించాలి"

కుర్రాళ్ళిచ్చిన నినాదం అంతా ఎత్తి పట్టుకున్నారు. చాలా సేపు గొంతులు పట్టేసాలా

అరిచారు. గున్నమ్మకు అలా అరవడంలో ఏదో ధిక్కరించడం కనిపించిందేమో బాధలేవో తేలిపోతున్నట్టు, సమస్యలు విడిపోతున్నట్టుగా అనిపించింది.

చాలాసేపటికి గాని ఎమ్మార్వో మాటాడింది వినిపించలే. అందుకే ఆయన మాట్లాడిందే తిరిగి మొదలుపెట్టారు.

ఎంత వేగం ఫోనెలి పోయిందో గాని పోలీసులు వేన్‌లలో లాఠీలు పట్టుకొని తుపాకులు భుజాలకు తగిలించుకొని దిగబడిపోయారు. చుట్టుముట్టారు. గున్నమ్మ వెంట్రుకలెందుకో నిక్కబొడుచుకున్నాయి.

ఎక్కు పెట్టిన తుపాకీల వైపు తృప్తిగా చూస్తూనే 'మనది శాంతియుత దేశం, ఆ విషయం మరువకూడదు' అచ్చం గాంధీగార్లాగే అన్నారు ఎమ్మార్వో. తోపులాటకి ముందుకొచ్చిన ఓ ముగ్గురి ముడుకుల మీద లాఠీలు పడి పై చర్మాన్ని ఊడబెరికాయి.

"అలా వుండాలి. మీ క్షేమాన్ని కోరే కదా మేమున్నాం. 1989వ సంవత్సరం వరకూ కరువు జిల్లాగా మన జిల్లాని కలెక్టర్ ఆనంద్‌గారు ప్రకటించేరు. మర్చిపోయారా? ఇప్పుడు కూడా....." ఎమ్మార్వో మాటకెవరో అడ్డుతగిలారు.

"మరి 1987 వరకు మాత్రమే ఋణాలు మాఫీ చేసారు గాని, ఆ తర్వాత రెండేళ్ళూ ఎందుకు ప్రకటించినట్టే 89 దాకా అమలు చేయలేదు" కుర్రాడెవడో గట్టిగా వున్నట్టున్నాడు. గొంతూ పెద్దదే!

ఎమ్మార్వోకి ఎంత వెతుక్కున్నా సమాధానం దొరకలే.

గున్నమ్మకి అంత జెంజాటంలో కూడా అప్పటి సంగతులు కళ్ళముందు మెదిలాయి. తమ అప్పు మాఫీ కాదన్నారు బేంకోళ్లు. ఒక ఏడు ముందల తీసుకుంటే వర్తించును అన్నారు వాళ్ళు. మరొక ఏడు వరకూ వర్తిస్తాదన్నారు కదా. అడిగితే ఇప్పటిలాగే అన్నారు గాని, తమకన్నా వెనకన అప్పు తీస్కునోళ్లవి ఆ ఆపీసర్లే ఎంత తిన్నారో గాని కామాపులు అయిపోనాయి, మాయయి పోనాయి.

"గతాన్ని తవ్వుకుంటే, తలకెత్తుకుంటెలగ? ఇప్పుడు మేం రిపోర్టు కలక్టరు గారికి పంపిస్తాం. మేం ఉద్యోగులం మమ్మల్ని వదిలీండి" ఎమ్మార్వోకి కిందో డెవడో దండమెట్టేసాడు.

జనం చేతులెత్తేసారు. ఏం చెయ్యాలో చేసినా ఏమయిందీ ఇదమిద్ధం కావడం లేదు. అందరితో పాటే గున్నమ్మా ఇల్లు చేరింది.

ముసల్దానికి ఎంతముందుగా కబురొచ్చిందో మంత్రుల్ని పేరు ఎరికున్నంత వరకు తిట్టి రాజుల కాలమే నయమంది. ఏ కాలమయినా ఏటొరిగిందీ లేదంది.

తగువు లాడితే తాడోపేడో తేల్చేసే తవిటికి ఏమీ తేలని ఈ విషయం మింగుడు పడడంలేదు.

ఆ రెండో పూటే గున్నమ్మ గుక్కెడు గెంజి తాగిందో లేదో అబరాగుబరాగా లేచి దున్నిన పొలంలో దోసిళ్ళతో పట్టి విత్తనాలు విసిరి జల్లింది. ఎకరాకు సరిపడినన్ని కాక ఒక్క మడకలో ఇద్దుం (2 కుంచాలు) విత్తనాలు మాత్రమే ఎయ్యడానికి ఒప్పుకుంది ముసల్ది. ఎండలెలాగుంతాయో సూసుకొని ఏద్దుం, వద్దులే అంది. గున్నమ్మ మొదలు అత్తతో పోట్లాటకు దిగినా ఏదో భయము ముందుకు పోనివ్వలే.

ఒక్క పొలుపు వానకి ఒక పొసర ఆశలు పెట్టుకున్నా, పెరిగిన ఎండలకి.... పెళ్ళున పేల్చేసిన ఎండలకి... భూమిలో వున్న తడి మూడు నాలుగు రోజుల్లో ఇంకిపే. వారం పది రోజులు తిరిగేసరికి లేత నార పుట్టింది పుట్టినట్టుగానే వాడిపే. సూస్తుండగానే సుట్టికెలిపే.

ఇంట్లో సుట్టికెలిపోతున్న పిల్లల్నీ కళ్లతో చూసి ఓర్చలేక విత్తనాలు దంచి బియ్యం సెయ్యడానికి మనసొప్పక గొప్పతిప్పలు పడిపోయింది గున్నమ్మ. తవిటికి మూడు తూముల విత్తనాలు ఇస్తే, మిగిలింది అయిత్తూముల వరి విత్తనాలు. వానల మీద ఆశలేదు. రేపటి మీద ఆశలేదు. వున్నదంతా ఇవాల్టి గురించే ఆలోచన. సీముసురయి నెరాలేక బియ్యం నిండుకుంటే విత్తనాల ధాన్యం దంచి బువ్వొండక తప్పలేదు, అదీ వారం రోజులకో... గడుపుకుంటే పదిరోజులకో మించిరావు.

సరీగప్పుడే వచ్చిపడ్డారు బేంకోళ్ళు. ఇచ్చిన గడువుకంటే ఎక్కువ రోజులే చూశామన్నారు. ఒకరిక్కాదు ఇరవై వేల మందికి ఋణాలిచ్చామన్నారు. ఇక్కడే కాదు నెల్లిమర్ల మండలం జరజాపు పేట, పారసం, పూతికపేట, కొండపేట, తంగుడుబిల్లి, రామతీర్థం, సతివాడ, ఇంకా గుర్ల మండలం కొండ గంద్రేడు, పాలవలస, గారికివలస అంతా ఇంతేనట. అందుకనే వసూలు కోసం ఆస్తులు జప్తు చేస్తున్నామని మంచాలు, తలుపులు, దొరికిన వస్తువులూ పట్టుకుపోక తప్పడం లేదన్నారు. ఇప్పటికి ఓసారి ఇలా చేసినా మీకు బుద్ధిరాలేదన్నారు.

"ఒక్క ఏటికి వదలండి" అందరిదీ ఒక్కటే మాట.

ఆ మాటకు విలువ లేదు. అందుకే వాళ్ళ పని ఆగలే. అది ఎంతవరకూ పోయిందంటే మనుషుల వంటి మీది వాటి కోసమూ వెతుకుతున్నాయి. చేతులు చాచాయి. మెడలోని తాళ్ళు పుటుక్కున తెంపాయి.

ఎవరో దేశభక్తో, ప్రభుభక్తోగాని వచ్చిన వాళ్ళలోని వాడే- 'తాళిబొట్లు తెంపరాదని ' ముఖ్యమంత్రి సెలవిచ్చిన విషయాన్ని గుర్తుచేశాడు. నిజమే ఆ దారప్పోగులతో మనకేం పని. ఈ నాయాళ్ళకి 'బంగార మొక్కటా? తాకట్టు పెట్టుకొనే తాహతయినా వుందా?' అని తుళ్ళితుళ్ళి నవ్వుతూ కార్యక్రమం ముందుకెళ్ళ నిచ్చారు మిగతావాళ్ళు.

ఇంట్లోకి చొరబడుతున్న వాళ్ళని గున్నమ్మ అడ్డుకుంది. 'అడ్డులే' అన్నారు వాళ్ళు. గున్నమ్మ కదల్లేదు. 'నిన్నే' అన్నారు. ఫలితం లేదు. 'లెగే' అన్నారు. 'లంజా' అన్నారు. వులకలే. 'లమ్డీ' అన్నారు. పలకలే. 'దెయ్యం పట్టిందే' అన్నారు. భుజం మీద చెయ్యేసి తోసారు. వెంటనే లేచి నిల్చుంది. లాఠీలు పటేల్‌మని అడ్డుకున్న చేతుల మీద పకాలున నవ్వాయి. రక్తాన్ని తుళ్ళ గొట్టాయి.

గున్నమ్మ ఏడ్చింది. వెయ్యి రూపాయలు అప్పు తీర్చామని మొత్తుకుంది. వాళ్ళు వినిపించుకోలే. పుస్తకాలు చూసుకోమంది. రవ్వంత చెలించలే. మిగతావి ఒక్క ఏడు ఓపిక పట్టమంది. వినే ఓపికలే. లాఠీ తన మీద పడింది. బుడ బుడ రక్తం చిమ్మింది. కాళ్ళకు వేళ్ళాడిన పిల్లలు 'అమ్మా' అంటూ బిక్కయిపోయారు. ముసల్ది మునుపులా తన్ని తోసినా ఈసారి కాయడానికి సిద్దంగా లేదు. తలబడిపోడానికి సిద్దంగా వుంది. చెంప వాయిస్తే మరో చెంప వాయించమనేలా లేదు. తనని తంతే కోడల్ని తన్నమని అందిచ్చేలా లేదు. తిరగబడింది. లాఠీల్ని అందుకుంది. తవిటి సాయమొచ్చింది. ఒకరూ ఒకరూ వచ్చారు. వందల చేతులయ్యాయి. వాళ్ళు వెనక్కి జంకారు. కుర్రాళ్ళు కర్రలతో ముందు నిలబడ్డారు. అది దారి కాదనేమో వెనక్కి వెళ్ళిపోయింది జీపు.

పేపర్లో చూసాడేమో దాలిగాడు ఇంటి కొచ్చాడు. గున్నమ్మని చూసి ఒక సింతసేపు కళ్ళలో నీరు తిప్పుకున్నా తల్లిని చూసి ఏదో నేర్చుకున్నట్టు గర్వంగా నవ్వాడు. గున్నమ్మా నవ్వింది. ముసల్దానికి డొక్కి పళ్ళు బయటకొచ్చాయి. అది చూసి పిల్లలూ నవ్వకుండా ఉండలేదు.

రెండ్రోజులు దాలిగాడు ఇంటివద్దనే ఉన్నాడు. పొలాలు చూస్తూ వున్నాడు. మెట్టులో వేసిన ఎకరా వేరుసెనగా ఆకు తెగులుతో అల్లాడిపోతోంది. ఆశల్ని ఆర్పి ఎండిపోతోంది.

ఈ ఏడాది వేరుశనగ ఆరు లక్షల నష్టం, మామిడి పది లక్షలు నష్టమని అంచనాలు వేసి అందకుండా పోయారు - ఆ మండలంలో తిరిగిన అధికార్లు. ఎవరి కోసమో ఆశపడే రోజులు పోయాయని దాలిగాడు కాళ్ళ వేళ్ళ బడి, కోళ్ళమ్మి గొఱ్ఱెలమ్మి ఆరొందలతో ఎరువులు కొట్టించాడు.

గున్నమ్మ కోలుకుంది.

ముసల్ది పిల్లలకు అన్నీ యుద్ధాల కథలు ఎందుకనో ఎక్కువగానే చెపుతోంది. తాలికంటే కొద్దిగ వుషారుగానే తిరుగాడుతోంది. దాలిగాడు మిల్లు లాకౌటు సంగతి తేల్లేదని తిరిగి ప్రయాణమయ్యాడు. దాలిగాడలాగ వెళ్ళాడో లేదో వాడి రెండో తమ్ముడు నూకడు వచ్చాడు. నూకడి పెరిగిన జుట్టూ, గెడ్డాం వాడి ఒళ్ళూ వాలకం చూసి ఇంట్లోని వాళ్ళే పోల్చుకోలేకపోయారు. ముసల్ది వాడి తీరుని చూసి ఏడ్చుకుంది. తరువాత దగ్గరుండి క్షవరమదీ చేయించి తలంటింది. గున్నమ్మ అన్నం పెట్టింది. తిన్నాకగాని వాడి నోటంట మాటరాలే.

గవర్నమెంటు టర్నోవరు టాక్సు పెంచాక యజమానులు లారీలు తిప్పొద్దనీసినారట. తిప్పకుండా సమ్మె పెట్టినారట. పనిలేదు కాబట్టి జీతం లేదనీసి ఓనరాళ్ళు డబ్బులివ్వలేదట. తిండికి కష్టమయి పోయిందట. ఇక్కడకు రావడం మరీ కష్టమయి పోయిందట. క్లీనరు జీవితమంత నరకం ఇంకొకటి లేదట. ఇప్పట్లో లారీలు తిరగవట, తిరిగినా ఆ బాడుకావు పనిలోకి వెళ్ళడట.

ముసల్ది మంచంకేసి చూస్తోంది. దాని నాలుగు కాళ్ళలో ఒక కాలు బలవంతంగా విరిచేయడం జ్ఞాపకం వచ్చింది. మరో కాలు వుత్తినే ఊడిపోయింది అని అనిపించలే. ఎవ్వరో అటూ ఇటూ తిప్పడంవల్ల పోయింది. మరోటి ఇప్పుడు ఊడిపోయింది. మిగిలిన ఒక్కదానివల్ల మంచం కాయదు. ఆ ఒక్క కాలూ (కోడూ) కదిలిపోయి అటూ ఇటూ ఊగుతోంది.

"మీయన్న వొస్తే ఎందలోనో సేరుదువు. ఏటో సేద్దులే" అని మాత్రమే అనగలిగింది గున్నమ్మ. అంతకు మించి ధైర్యం చెప్పడం ఆమెకు రాలేదు. ఇంట్లో అలానే వుండలేక మెట్టు పొలంకేసి నడిచింది. తవిటీ పేడకల్లు కని తోడుగా కలసి వచ్చింది.

ఎండ చెమటలు రేపుతోంది. గున్నమ్మ ఎండని తిట్టుకుంటూ పొలం చేరింది. పొలంలో దిగేసరికి కాళ్ళకింద పడిన వేరుశెనగ మొక్కల్లోని కొన్ని ఆకులు ఎండిపోయి వుండడం చేత జరజరా రాలి చప్పుడు చేస్తూ చితికిపోయాయి. పచ్చగా వున్న అక్కడక్కడి మొక్కలు కొంత ప్రాణం నిలబెట్టాయి. దగ్గర కెళ్ళి మొక్కల్ని తడిమింది. తవిటి ఓ మొక్కని తవ్వి తీసి తినబోయి ఆగిపోయింది. కాయలు ఆరిపోవడం, లేతగా వుండడం మాటటుంచి ముక్కుపుటాల్ని కదిపింది. 'ఓలిగున్నా' అని గున్నమ్మని పిలిచింది. తనకేసి చూసిన గున్నమ్మ చేతిలో వేరు సెనగ మొక్కని పెడుతూ "మొన్న నీ మొగుడు ఎరువులు కొట్టించినాడే" అడిగింది.

"ఆ.... ఆకుతెగులని ఆరొందలు పెట్టి మరీ కొట్టించినాడు మందు" ఆశ్చర్యంగా ముఖం పెట్టింది గున్నమ్మ.

"మూజాడే...." అంటూ మొక్కని గున్నమ్మ ముక్కు దగ్గర పెట్టింది తవిటి.

గున్నమ్మ ముక్కులోనికి గాలి పీల్చి వదిలి "సీమలమందు ..... గమీక్షను ...." అంటూ తడబడిపోయింది. తాల్లేక "ఏటిది?" అడిగింది తవిట్ని.

"ఏటి సెప్పమంతావే, మాములే! ఆ బాడుకావులు ఎరువులనీసి సీమలమందు కలిపీసిచ్చే(న్రు అంతేనే ......" అంది తవిటి.

"ఎవులమ్మి నారే, ఆల కుదురు లేకండయిపోతే ..... ఆ అమ్మినోడి దిబ్బమీద దీపం లేకండయి పోను ..... అయినా ఈ మనిషికెంత కళ్ళవుపడ బోవే...." గున్నమ్మ గొంతు పెద్దదయింది.

"దాలిగాడు మాత్రం అందల దూరి సూస్తాడేటే?! అప్పుడెరువులు తీస్కెళ్ళండన్నారు. ఇప్పుడో ఎరువులు లేవంతన్నారు, అందరెగబడీసరికి సిల్లర మల్లరోళ్ళనుండి పెద్దే పౌరులదాక మోసమే! లైసునీసు (లైసెన్స్) వున్నోళూ లేనోళూ అంతే..." తవిటి ఇదేమి విచిత్రం కాదన్నట్టు చెప్పింది. తరువాత పేడకల్లుకని తిరిగి ఎలిపోయింది.

గున్నమ్మ గట్టుమీద అలాగే కూర్చుండిపోయింది. ఆమెలో ఉక్రోషం తగ్గలే. అలాగే మడిలోకి చూసింది. దానికి కట్టాల్సిన శిస్తు గుర్తుకు వచ్చింది, మెట్టుకీ ముప్పై రూపాయలే. పల్లానికీ (ఎకరాకి) ముప్పైరూపాయలే! సంవత్సరం సంవత్సరం పెరుగుతున్న శిస్తు పెనుభారంలా తోచింది. ఈ భూమివల్లే బువ్వలేకండయిపోతన్నామనీ అనిపించింది.

ఎందుకనో అక్కడ మరో గడియ వుండబుద్ధికాలే. లేచి నిలబడింది గాని మనసు నిలకడగాలే. కాళ్ళకి ఇంటికి తప్ప వేరే దారిలే.

ఇంట్లో కొస్తే నెరా సామానుల్లేవు. బియ్యమూ పప్పులూ లేవు. చివరికి ఎప్పుడూ ఆడించి వుంచుకున్న నూనె లేదు. మనసు మనసులా లేదు.

దాలిగాడికి జీతాల్లేవు. అందుకే ఇంటికి భత్యాల్లేవు.

సత్తి ముక్కుకీ సీము పోసింది. రసేదో నీళ్ళలాగ కారుతూవుంటే ఈగలు జుమ్మని వాలుతూ కరుస్తున్నాయి. అందుకేనోమో ఒల్లు వేడిగా వుండి జ్వరం వచ్చినట్టుగుంది. 'అమ్మా' అంటూ గుడ్ల నీళ్ళు తిప్పుతూ తల్లి పక్కలో చిన్నపిల్లలా చేరి పయ్యాడ పట్టుకుంది. గున్నమ్మకి బోధపడింది. సత్తి ముక్కుని కోటేరు ముక్కని ముద్దులాడిన తనకళ్ళే అటు చూడలేక పోతున్నాయి. వంట్లో తెమిలినట్టయింది. చూపు చెవుల వేపుగా

తిప్పింది. చెవులూ పులపచ్చిగా వుబ్బి వున్నాయి. పట్టిస్తే సన్నని దుర్వాసన కూడా గున్నమ్మ దృష్టిని దాటలేదు.

ముసల్ది మనుమరాలు సత్తి దగ్గర కూర్చొని దాని ఒళ్ళంతా నిమిరి "గున్నా దీనికి రోల్డుగోల్డువి వంటికి పడవు. అవి పెట్టే పుళ్ళయిపోనాయి. తీసి ఈని (చీపురు) పుల్ల దోపినా పుళ్ళు తగ్గలే. సెరమ్మ అక్కడికి కుళ్ళిపోతంది, ఇకన ఆ పుల్లలు తీసిడిమే నాడిము" అంది.

"కుట్లు కలిసిపోతాయి గావల్ల" భయపడింది గున్నమ్మ.

"మరెలగే? పుళ్ళు తగ్గితే ఆతర్త కావలంతే మళ్ళీ కుట్లేసుకోవచ్చును" అంది ముసల్ది. ఆ మాటలకి సత్తి మరింత భయపడిపోతూ తల్లి కడుపులోకి వుండలా కుచించుకు పోయి దూరిపోవడానికి ప్రయత్నించింది. దాని తమ్ముళ్ళిద్దరికీ అంతకు ముందు ముక్కుపుడక కాళ్ళూ చేతులు పట్టి తీసియ్యడం గుర్తుకొచ్చిందేమో 'వద్దే' అన్నారు.

"అక్కకి ఏటవదే అమ్మా, మీ మాలచ్చిమి అత్తలాగ... అల్లాల మేష్టారు పాపలాగ రింగులు బులాకి గట్రా ఎట్టుకోవాలంతే పుల్లు తగ్గిపోవాల కదా, ఆ పుల్ల లుంతే ఎలాగ రింగులు పెడతామే...." మనుమలిద్దరికీ ప్రేమగా అర్ధమయినట్టు చెప్పింది. ఆ చెప్పడంలో సత్తికి ఆశ చూపించడముంది.

పొరుగోళ్ళ మాలచ్చిమిని పిలుసుకొచ్చి ఆవిడా, గున్నమ్మా ఇద్దరూ సత్తిని పట్టుకుంటే ముసల్దే పుల్లలు లాగింది. రక్తం, చీము చిమ్ముతుంటె కళ్ళుమూసుకుంది గున్నమ్మ, సత్తి 'వద్దే అమ్మా' అంటూ ఏడుస్తూనే వుంది. 'లే దే.... సరి , ఒక్కదప సీమ సిటుక్కుమన్నట్టంతే' ముసల్ది చెపుతూనే తన పని కానిచ్చింది. ఆ పని జరిగినంతసేపు పిల్లలిద్దరూ ఊపిరి తియ్యలే.

బోడిగా వున్న కూతురు కళ్ళలోకి చూడలేకపోయింది గున్నమ్మ. ముసల్దీ ఎందుకో చాలా నిసంకుడుగ వుండిపోయింది.

వీధిలో మళ్ళీ డప్పులు!

ఏ ఆపదొచ్చిందో అని అత్తా కోడళ్ళు భయం భయంగానే అరుగుమీద కొచ్చారు.

"ఇందుమూలంగా గ్రామ యావన్మందికి తెలియజేయునది ఏమనగా! అయ్యలారా దేశంల కరువొచ్చి పడిందని.... పంటలులేవని..... దీనంతటికీ వానల్లేవని సర్కారువారు గుర్తించినందున వరుణ పూజలు పదకొండు రోజులు చెయ్యవలసిందిగా కోరు తున్నారహో...." చెప్పిందే చెప్పుకుంటూ వెళ్ళిపోయాడు తలారి.

"ఇంట్ల పిల్లలకే అన్నం కడుపునిండ ఎట్టలేకపోతున్నాము. దేవుడికి పరమాణ్ణం పెట్టాల!" ముసల్ది తనలో తను అనుకున్నట్టుగ పైకే అంది.

"ఆఁ.... అమ్మోరికీ కోలు కోసినం, గొఱ్ఱెలు కోసినం... కప్పలకు పూజలూ సేసినం. సాల్లేదని శివుడి కోవిల్ల గర్భగుడిలో బిందెలతోటి నీళ్ళొంపినాం. బిందెలకు బిందెలు నడుం నారయినట్టు పోసినాం. ఏనికి పనికొచ్చింది? ఇది నారాయణుడు సేసింది కాదు, నరుడు సేసింది....!" తవిటి దండకం మొదలెట్టింది.

ఊర్లో పూజలవుతుంటే ఎండ విరగకాస్తోంది. ఒక్క చినుకూ తొనకలేదు. గున్నమ్మ వరుణ జపం దగ్గర జరుగుతున్న హోమం దగ్గరికి వెళ్ళింది. దేవుణ్ని క్షణకాలం కొలవలేకపోయింది. ఆమె కళ్ళ ముందు మాడి మసయిపోతున్న నారు.... ఊభాలు జరక్కుండా వున్న నారే కదలాడింది. పైగా ఇంట్లో అన్ని నిండుకోవడం వల్ల ఆమె మనసు దేనిమీద లగ్నం కావడం లేదు. తిరిగి వచ్చేసింది. ఎందుకో మరింక ఆ పదకొండు రోజులు పూజ దగ్గరకు వెళ్ళడం మాని ఆకాశం వంకే ఆశగా చూస్తూ కాలం గడిపింది.

వరుణ జపాలు వట్టిపోయాయేగాని వానరాలే!

దేవుడికి పూజలు చేసి దేశభక్తిని చాటుకున్న కాంగ్రెసు కార్యకర్తలు కరువు మీద మీటింగు పెట్టారు. కలసికట్టుగ కరువుని ఎదుర్కోవాలని ఆవేశపడ్డవారిని గున్నమ్మ అర్థం చేసుకోలేకపోయింది. ఆమె కామాటా అర్థంకాలేదు. కృత్రిమ వర్షాలు కురిపిస్తామని గవర్నమెంటు ప్రయోగాలు చేస్తుందన్నారు, అదీ అర్థంకాలేదు. ఒక్కో ప్రయోగానికి పదివేలరూపాయలు ఖర్చవుతాయని, అయితే ఒక్కోసారి కెమికల్స్ వాతావరణం కుదరక వర్షాలు పడకపోవచ్చునని అయినా ప్రభుత్వం వెనకంజ వేయడం లేదని, ప్రజల శ్రేయస్సే ముఖ్యమని, ఇంకా ఆ కృత్రిమ వర్షపునీటిని పరీక్షకు పంపారని, రిజల్టు రాలేదని అన్నారు. గున్నమ్మకీ సారి అర్థమయినా కోపం వచ్చింది. పక్కనే వున్న తవిటితో "ఆలెక్కడో ప్రయోగాలు యజ్ఞాలు సేస్తేమటుకు ఇక్కడ వానలు కురుస్తాయే" పెద్దగానే అంది. ఆమాట స్టేజి వరకు వినిపించింది.

"కురవ్వు గాని ఇక్కడ చేస్తే ఇక్కడా కురుస్తాయి" స్టేజీమీద వ్యక్తి మైకులోనే సమాధానమిచ్చాడు.

"ఎప్పుడు సేస్తారయ్యా, సేస్తేమటుకు కురవొచ్చు....కురవకా పోవచ్చంతన్నారు గదా, అలాగెన్ని కాడ్ల సేత్తారు. ఎన్ని వర్షాలు లెక్కడతారు.... ఎన్ని పొలాలు తడుపుతారు? ఆ పదివేలెట్టి వూరి పక్క సెరువు లోతుసేసి గట్టేస్తే వర్షమొచ్చినపుడు గట్లూ కొట్టవు, నీరూ

నిలుస్తాది..... పంటా....'' గున్నమ్మకి సపోర్టు వచ్చిన తవిటి గొంతుక్కి మైకు అక్కరలేదు. ప్రమాదం ముంచుకొస్తున్నట్టు తవిట్ని ఎవరెవరో ఈడ్చుకుపోయారు.

గున్నమ్మకి తవిటి మాటలెంతగానో నచ్చాయి. నిజంగా గవర్నమెంటోదో ఈటోళ్ళ విద్యలా గారడీ చేస్తున్నట్టనిపించి అక్కడుండ బుద్దెయ్యక ఇల్లు చేరుకుంది.

దాలిగాడొచ్చున్నాడు. పెనిమిటిని చూడ్డంతో గున్నమ్మ మనసు కొద్దిగ చల్లబడింది. లాకౌట్ విషయం అడక్క ముందే చెప్పాడు. నిరసన ప్రదర్శనలూ, దీక్షలూ ఎక్కువ చేసారట. మిల్లుని చుట్టు ముట్టేరట. ఈగగాని దోమగాని చొరబడకుండా కాపలా కాసారట. కాస్తున్నారట. జీతాల సంగతి, లాకౌట్ సంగతి తేల్చనిదే అడుగు లోపలికి పెట్టనివ్వరట. అసలు గవర్నమెంటుకి చెప్పకుండా మిల్లు ముయ్యడాకి వీల్లేదట. అయినా ఏడాదేడాది లాకౌట్ ప్రకటించీసి ఇష్టమొచ్చినపుడలా ధైర్యంగా మూస్సి కలకత్తా వెళ్ళిపోతే మిల్లుని ప్రభుత్వపరం చేయెచ్చునట. కాని యజమానులతో గవర్నమెంటు అంటే నాయకులు కుమ్మక్కయిపోయి ఇలా నొల్లుకు తింటున్నారట.

దాలిగాడు యూనియన్లో చురుకుగా తిరుగుతున్నట్లు వాడు తెలీని విషయాలు చెప్పినపుడే గున్నమ్మకు అర్థమయింది. ఏదో మూల బెంగగానూ వున్నా జరుపుతున్న పోరు ఏదో సాధించగలమనే నమ్మకాన్నిచ్చింది.

ఎవుల దగ్గర తెచ్చాడో వందరూపాయలు ఇంటి భత్యానికని దాలిగాడు గున్నమ్మ చేతిలో పెట్టాడు. చాలవు అయినా సర్దమన్నాడు. ఇంతకంటే అప్పు పలకలేదన్నాడు. జీతాల్లేక వడ్డీలే కట్టలేకపోతుంటే కొత్తప్పు ఎవరిస్తారన్నాడు. ఏదో చెయ్యమన్నాడు. ఇక్కడ వుండడానికి అవదన్నాడు. మిల్లు లాకౌట్ ఎత్తీదాక ఇలాగే వుంటుందన్నాడు.

దాలిగాడు వెళ్ళిపోయాక, పొయ్యిమీదకి ఏమీలేక గున్నమ్మ ఆ వందరూపాయలూ పట్టుకొని అంగడి కెళ్ళింది.

బియ్యం కేజీ ఆర్రూపాయలనుండి ఎనిమిది అవతలే గాని ఇవతల లేదు. పప్పులన్నీ కేజీ ఇరవయ్యేసి అయిపోనాయి. నిన్న మొన్నటిదాక ఇరవైతొమ్మిదీ ముప్ఫై కిచ్చిన కేజీ నూనె ముప్ఫై ఎనిమిదయి పోయింది. ఏమీలేదు. ఉల్లిపాయలు మూడున్నర నుండి ఆరున్నరయి పోయింది. వంకాయ, కేబీజీ, బంగాళ దుంప అన్నీ కేజీ నాలుగు నుండి ఎనిమిదికెదిగాయి. టమాట పళ్ళు సిగతరగ కేజీ ఇరవయ్యట....

అన్నిటికీ టర్నోవర్ టాక్సేనట. లారీలు తిరగడం లేదట. సరుకు లేదట. ఇష్టం వుంటే కొనాలట, లేకపోతే మానెయ్యాలట. బేరాల్లేవట. లోకమంతా ఇంతేనట. అందుకే తామంతా బందులు పెడతారట.

ఏవీ కొన బుద్దెయ్యలేదు గున్నమ్మకి. వొట్టి చేతులతో ఇంటికెళ్ళడానికి దారిలేదు. గున్నమ్మ మౌనాన్ని చూసి "పూట పూటకీ రేట్లు పెరిగి పోతుంటే ఇంకా ఆలోచిస్తావేటమ్మా తేల్చక" అన్నాడు శెట్టి.

గున్నమ్మ బియ్యమూ పప్పులూ నూనె కొనేసరికి కూరలకి చాల్లేదు, అరువు పెట్టింది. ఎంతో బతిమలాడితే ఉత్తిపుణ్యానికిచ్చినట్లు అరువుకి ఒప్పుకున్నాడు. చేతి సంచిడు నిండని సరుకుతో ఇంటికొచ్చింది.

ముసల్ది రేట్లు అడిగి తెలుసుకొని మరోసారి నాయకుల్నీ వ్యాపారస్తుల్నీ తిట్టి పోసింది. వాళ్ళ అబ్బ ఏడు వంశాలకు తగిలినట్టు శాపాలు పెట్టింది. రేపు లారీలు తిరిగినా టర్నోవరా అదేటో ఎత్తినా దించినా ....ఏమైనా.... పెంచిన రేట్లు కొద్దిగ తగ్గొచ్చుగాని మునపటి రేట్లుకి మాత్రం అమ్మరని తేల్చి చెప్పేసింది.

ముసల్దాని నోరు మూతబడేసరికి వంటయిపోయింది. పిల్లలు ముగ్గురూ తృప్తిగా ఓ పూట తినేసరికి అత్తా కోడళ్ళు అన్నీ మరిచిపోయారు. తామూ కొద్దిగ అన్నంతిని గెంజి త్రాగి త్రేన్చారు. నూకడు ముందలే వొడ్డించుకుని తినేసి వాడల వర్తకం పోతున్నట్టు నాయుడుగారి అరుగెక్కేసాడు పేకాటకి.

చీకటి పడింది. కరెంటు లోవోల్టేజీ ఏమో వీధి దీపాలు హరికేను లాంతర్లలాగే వెలుగుతున్నాయి.

అన్నం నాయుడు నలుగురు కుర్రాళ్ళని పోగుచేసి కరంటు స్థంభంకిందే ఉపన్యాసమిస్తున్నాడు. మంత్రిగారు మన ఏరియావోడని, మనవోడని సెంకలు గుద్దీస్తే సరిపోదన్నాడు. మనల్ని ఒక్కసారయినా సూడ్డానికి ఎలిపొచ్చాడా... లేదే! ఆయన రాడు అన్నాడు పదవున్నదాక రాడన్నాడు. కరువుని పట్టించుకోడన్నాడు. ఈసారి కాంగ్రేసు రాదన్నాడు.

ఆ మాటలు వీధి చివరిదాక మైకులు లేకుండా వినిపిస్తున్నాయి. ఈలోగా మరో గుంపు తయారయింది. తెలుగుదేశం వస్తే బూడిద పంచుతార్రో నామాలు దిద్దుకోడానికి. అరుపు, కరువుకి కట్టలు తీసి పంచతన్నార్రో 'దాన కర్ణుడు'. నవ్వులు.

తరువాత గోలలో ఎవ్వరి మాటలు వినిపించలే కాని ఎవరెవరివో తలలు పగిలిపోయాయి. ఇంత జరిగితే గాని ఊరు నిసంకుడు కాలే.

ఈ తతంగమంతా ఎప్పుడూ వున్నదనేమో పిల్లల్ని చూస్తూ, వాళ్ళు రాసిన ముద్దు

ముద్దు అక్షరాల్ని మెచ్చుకుంటూ ఆనక పడుకోబెట్టి జోకొట్టి తనూ పక్కనే పడుకుంది గున్నమ్మ. సత్తి పొద్దోగల్లే పడుకుండిపోయింది.

తవిటీ, ముసల్దీ ఇందాక కొట్లాడుకున్నోళ్ళని తలచుకొని 'ఎవులో సస్తేగాని ఇంకోలికి బుద్దిరాదు' అనుకున్నారు. 'అదీ ఎంతో దూరంలో లేదని' తీర్మానించుకున్నారు.

తెల్లవారిందో లేదో గున్నమ్మ గుండెలో రాయిపడింది. రోజులెన్ని లెక్కపెట్టినా లెక్కలేనన్ని రోజులు ముందున్నాయి అనిపించింది. ఎందులోనో ఇరుకున్నట్టు అందులోంచి బయటపడాలని ఒకటికి పదిసార్లనుకుంది. కడుపు నొచ్చినట్టయి పొలాలకేసి చెంబుతో నీళ్ళు పట్టుకు వెళ్ళి, అట్నుంచటే పొలానికి వెళ్ళింది. పందోం పుల్ల నోట్లో పెట్టుకు నమిలిందే గాని తోముకోలేదు. అలానే గట్టున కూర్చుంది.

తొలేత వేసిన నారు చచ్చిపోయిన ఆనవాళ్ళింక చెరిగిపోలేదు. రెండోదపా పోసిన నారూ నాడిమిగా ఏమీలేదు. భూమి పగుల్లిచ్చింది. మంచు కూడా కురవలేదో రేవిటెండకు ఆరిపోయిందో ఎక్కడ తడి కాదు కదా చెమ్మయినా కానరాలేదు.

కిందిటేడు ఈపాటికి ఊడ్పులన్నీ అయిపోయి పచ్చగా పొలాలు తలలాడించాయి, పోనేటి పచ్చగ పండితే మాత్రం కష్టాలు తీరిపోయాయా? లేదే...?! గతమంతా తడుముకుంది.....

ఉన్న ఎకరా మీద ఎన్ని ఆశలు వున్నా ఏడాది ఏడాది ఎదుగూ బొదుగూ లేని బతుకు అయిపోయింది. ఎకరాకి గరిసెడు పండితే గడిచిపోయిందా కాలం?....

ఆకాశం కేసి ఆశలొగ్గేసి, నారు పోతకి దమ్ము పెడితే నీరసనయినా నూటేబయి వుండాల, ఆకు తీతకి మరక నూటేబయి వుండాల. మళ్ళీ దమ్ము పట్టడాకి మరొక నూటేబయి వుండాల. వుడుపులకి ఎలగ లెక్కలేసినా రెండొందలుండాల. ఎరువులకి ఎనిమిదొందలుకి తక్కువ కాదు. పురుగుల మందుకి రెండొందలు, ఎలకల మందుకి యాభైవుండాల, కోతకి నూటేబయి వుండాల. సేని మోతకి మరొక నూటేబయి. నూర్పుల కాటికి రొండందలు.... అన్నట్టుగ గాబుతీతకో... ఇలగ లెక్కలేసుకోడమే!

అంత డబ్బు మదుపు వుండాల. ఇదంతా నీళ్ళందితేనే! ఎకరాకి ఇంటందరూ కష్టపడి ఇంత మదుపూ పెడితే గరిసెడు ధాన్యం. రేటులు చూస్సి ఖర్చులు తీస్తే నలుగురయిదుగురు అయిదారు నెల్ల కష్టానికి మిగిలింది వెయ్యిరూపాయలు దాటి వుండదు. ఇదే ఎక్కువయి పోయిందనేమో పన్ను (శిస్తు)... సంతల చింతపండు లాగ బేంకోళ్ళ అప్పు వాడినప్పుడు చాలదు! తీర్చినపుడు ఎక్కువయిపోతుంది.! వదలదు.

ఇవన్నీ ఆలోచించాక కష్టానికి తగ్గ ధర పలికితే బాగున్ను అనిపించింది. అంతలోనే ఆరుమాసాలే గింజలు రావు.... మళ్ళీ కొనుక్కుందామంటే అందవు అనీ అనిపించింది. ధర పెరిగితే మరీ అందుకోలేమనిపించింది. ధరలు పెరగాలా వద్దా అన్న దానిమీద ఎటూ తేల్చుకోలేకపోయింది. ఏదో మాయ కమ్మినట్టయింది.

కొద్ది క్షణాలు అలా తల పట్టుకు కూర్చుండి పోయిన గున్నమ్మకి ఆలోచించే కొద్దీ మాయంతా వీడిపోసాగింది.

కష్టానికి ఫలితముండాల. ఫలితముండాలంటే గిట్టుబాటు అయిన ధర వుండాల. గిట్టుబాటు లేప్పోతే సెమట సుక్కకి విలువలేదు, వుండదు. అది లేప్పోతే మనిషి లేడు, మనిషికి బతుకులేదు. కాబట్టి గిట్టుబాటెలగైనా వుండి తీరాల. మూడు గాలాలు కష్టపడినోళ్ళ కడుపులు మూడుపూటలు నిండి తీరాల. కష్టపడ్డాకి సరిపడ్డ బూమివుండాల. అలగ బూముంతే బువ్వ వుంతాది. బూమి సరిపడినంత వుంతే సేన, కొనడమేల? అమ్మడమేల? ఇన్ని పంరాకులేల? పాట్లేల?......

ప్రశ్నించుకొనే కొద్దీ ఏదో అర్థమౌతోంది....

ఒక్కనాడు బురదలోకి దిగకపోయినా బువ్వకి లోటులేని సూర్యనారాయణ రాజు గుర్తుకొచ్చాడు. నలభై ఎకరాలుండడంవల్లే నాగలి పట్టని ప్రెసిడెంటు గుర్తుకొచ్చాడు. అరక పట్టని అరవై డెబ్బై ఎకరాల అన్నం నాయుడు గుర్తుకొచ్చాడు. అందరూ గుర్తుకొచ్చారు.

కష్టపడ్డోళ్ళ కడుపులు ఎందుకు ఖాళీగా వుంటున్నాయో క్రమంగా అర్థమయింది గున్నమ్మకి. కూలోల్లు కూలోళ్ళుగానే మిగులుతున్నారెందుకో... బుగతలు బుగతలుగా ఎదుగుతున్నారెందుకో... ఆ మూలమేదో అర్థమయింది. బూమి అందరికీ సమంగా వుండాలనిపించింది. కష్టపడేవోడికే బూమి చెందాలనిపించింది. తనాలోచన తనకే విచిత్రంగా వున్నా, బతుకు రోతలోంచి బయటపడ్డానికి గింజులాడుకోవడంలో వచ్చిన ఆలోచన ఆనందంగా వుంది. అది తప్ప వేరే దారిలేనట్టుగా వుంది.

ఎందుకో గున్నమ్మ వంట్లోకి ఎక్కడలేని సత్తువా వచ్చి చేరింది. ఇంత కాలంగా వెతుకుతున్నదేదో దొరికినట్టు నడుస్తున్నట్టుగానే పరుగుతీసింది.

ఇంటికి వెళ్ళేసరికి దాలిగాడొచ్చున్నాడు. గున్నమ్మని చూస్తూనే నెల్లిమర్ల బయల్దేరమన్నాడు. పిల్లల్ని తోడ్సుకొని పదమన్నాడు. సత్తికి వంట్లో బాగులేదు. కాబట్టి ముసల్ది పిల్లదాని కాపలాకి వుండిపోతుందన్నాడు. రెండు కంచాలు గ్లాసులు పట్టుకోమన్నాడు.

'ఆకలి ప్రదర్శనలు' జరపాలని కార్మికులంతా నిశ్చయించారన్నాడు. ఎన్నిచేసినా ఎవ్వరికీ ఏమీ పట్టడం లేదన్నాడు. పడితే మంత్రిగారింత మోసం చెయ్యరన్నాడు. మూడువందల అరవై టన్నుల బేళ్ళను మంత్రిగారి మాట నమ్మే విడిచిపెట్టామన్నాడు. సరుకు వుండిపోయిందని బాధలేదు కాబట్టి యజమానులు యికన పత్తా వుండరన్నాడు. మా ఆరేడువేల మందేకాక జనమందరికీ చెప్పడానికే ఈ ప్రదర్శన అన్నాడు. మనిషి ఆవేశంగా వున్నాడు. ఆ ఆవేశమెందుకో గున్నమ్మకి బాగా నచ్చింది. మొగుణ్ణి మనసులోనే మెచ్చుకొంది.

ఆ వూర్లోని చాలా కుటుంబాలలాగే బయలుదేరాయి. ముసల్దానికి బయలుదేర బుద్దిపుట్టినా కొడుకు మాట కాదనలేక ఇంకోదపయినా వస్తానంది. పిల్లలకి ముస్తాబు చేసింది. గున్నమ్మా చీర మార్చుకుని పిల్లలతో మగని వెంట బయలుదేరింది.

మిల్లుని నమ్ముకొని చుట్టుపక్కల పల్లెలో కాపురముంటున్న కార్మికులందరూ నెల్లిమర్ల చేరుకున్నారు. అంతమందిని గున్నమ్మ చూడ్డం అదే మొదటిసారి. చూసి ఆశ్చర్యపోయింది. ఇంతమంది జనం ఏకమయినా ఒకరో ఇద్దరో యజమానులకే బలముండడం ఆమెకు మరీ ఆశ్చర్యమేసింది. ఆ బలమంతా ఆమెకు పోలీసుల రూపంలో కనబడ్డాది. రాజకీయ నాయకుల రూపంలో కనబడ్డాది. గవర్నమెంటు రూపంలో కనబడ్డాది.

ప్రవాహంలా సాగిపోతున్న జనం గుంపులో చేరి గున్నమ్మా గొంతు ఎత్తింది.

"యాజమాన్య నిర్లక్ష వైఖరి నశించాలి" నినాదం!

"నశించాలి.... నశించాలి" ప్రతి నినాదం!

"లాకౌట్‌ను వెంటనే ఎత్తి వేయాలి" నినాదం!

"ఎత్తివేయాలి.... ఎత్తివేయాలి" ప్రతి నినాదం!!

అందర్లోకి గున్నమ్మ గొంతే పెద్దగా వుంది. ఎవరో గున్నమ్మనే ముందుకొచ్చి నినాదమిమ్మన్నారు. గున్నమ్మ సిగ్గుపడలేదు గాని మొహమాటపడుతూ మగణ్ణి చూస్తూ, కళ్ళతో వచ్చిన సైగని కాదనలేక.... తన అంతరాంతల్లోంచి కెర్లుకొస్తున్న ఆవేశాన్ని అణచలేక గొంతెత్తి అరిచింది.

"లాకౌట్ ఎత్తాలి' ఆమె గొంతుకి మైకు అవసరంలేదు. ఆమె గొంతుకి అనుభవం లేనట్లు లేదు. దాలిగాడు గున్నమ్మని ఇష్టంగా చూస్తున్నాడు. పిల్లలూ ఆలుకి మించి అందరితోపాటే అరుస్తూ కంచాలు, గలాసలు తిప్పుతున్నారు.

ఊరి రోడ్లను తిప్పి మిల్లును ముట్టింది గుంపు. పెద్ద ప్రమాదం జరిగిపోతున్నట్టు అప్పటికే పోలీసులు లాఠీలు తుపాకులతో కాపుకి దిగిపోయారు. మిల్లు ముందలే కార్మిక నాయకులు మాట్లాడారు. గున్నమ్మ ఆ వుపన్యాసాల్ని సగంవరకే వింది. ఆ తరువాత ఆమె మెదడులోకి ఏవేవో ఆలోచనలు దూసుకువస్తున్నాయేమో చూపులు మాత్రమే నిలిపింది. చెవులకి ఏమీ వినిపించడంలేదు.

" ... పనిచేసే నౌకర్లందరూ ఒకటిగ కూడినట్టు రైతులందరూ కూడితే బాగున్ను .. పెద్ద రైతులు రారేమో? ప్రెసిడెంటూ పెద్దలూ రారేమో? రాకపోతే లేదు. సిన్న, సన్నకారు వుండనే వుంతారు. పేదలు అండగనే వుంతారు. కరువొస్తే కాటకమొస్తే కలవమని, కాటికి ఎళ్లిపోతామనీసినోడు లేడు. అందరి బాధలొకటయి పోరు జేస్తారు...." గున్నమ్మ ఆలోచనలు మారుమ్రోగిన చప్పట్లతో నినాదాలతో ఆగిపోయినా, ఆమెకు తలచుకున్న కొద్దీ ఆత్మసంతృప్తి ఎక్కువవుతూవుంది.

ఆ రోజుకి ప్రదర్శన ముగిసింది. మరుసటి రోజు విజయనగరం వెళ్ళి కలెక్టరుకు రిపోర్టు ఇవ్వాలి. ఎవ్వరూ వెళ్ళిపోవద్దని యూనియన్ నాయకులు కోరారు. ఆ మిల్లుపక్క అశోక చెట్ల కిందే అందరూ ఆ రాత్రి గడిపారు.అందరితోపాటే గున్నమ్మా, ఆమె పిల్లలూను.

తెల్లవారింది.

మిల్లులో పని చేసేది ఆరేడు వేలమందయినా పోగయింది పది పన్నెండు వేల దాక వుంటారు. అంతమందిలో తవిటి కూడా ఎక్కడయినా వుంటుందేమోనని గున్నమ్మ తనకు తెలీకుండానే వెతుకులాడుతోంది.

ఎండెలగ మండిపోయినా విజయనగరం కలెక్టరు ఆఫీసుదాక జనమే జనం! కలక్టరాపీసు కిటకిటలాడిపోయింది మిల్లుమూతను సహించని గొంతులు పేగులు తెగిపోయేలా అరిచాయి.

కలెక్టరుగారు బయటకు వచ్చారు. అలవాటుగా ఆనవాయితీగా మిల్లు మూతపడ్డం గురించి యూనియన్ నాయకులు చాలా చాలా చెప్పేరు. మాటల మధ్యలో నలుగురూ నాలుగు మాటలూ చెప్పుకున్నారు. ఆ బాధల్ని విన్నాక - అన్నీ తెలుసుకున్నాక- ఆ కలెక్టరుబాబు చూస్తానన్నాడేగాని చేస్తానని అనలేకపోయాడెందుకో? కలెక్టర్ని నిలబెట్టేసిన కళ్ళేమేదో మంత్రుల చేతుల్లోనే ఇడికున్నట్టు సమాధానపడింది.

తిరిగి నెల్లిమర్ల చేరుకొనేసరికి సాయంత్రమయింది. దాలిగాడూ గున్నమ్మా పిల్లల్ని

తీసుకొని ఊరు చేరేసరికి చీకటి పడిపోయింది. ముసల్ది ఏమి వండిందోగాని తినీ తిండంతోటే వళ్ళలిసిపోయిందేమో ఎక్కడోళ్ళక్కడే నిద్రపోయినారు.

ఆ తెల్లవారి దాలిగాడు నెల్లిమర్ల ఎల్లకుండ ఊర్లోనే వున్నాడు. అప్పుడే నారిగాడు 'మీ దండాశిని అరెస్టు సేస్సినారంటూ' కబురు తీసుకొచ్చాడు. ఇంటందరూ గక్కురుమని ఏటయిందంటే వాడు అసలు విషయం చెప్పాడు. సారాయారక్కులన్నీ గవర్నమెంటు గుంజేసుకున్నాక - సారా ఎత్తెస్తన్నామని సెప్పినా ఐ.ఎమ్.ఎఫ్.ఎల్ అమ్మడానికి సీసాలు అవుసరం పడ్డాయిట. తెలుగుదేశమోలు ఏలినప్పుడు కొత్తలో- దించిన సీసాలకి కొలువొచ్చిందట. దిసాతోటి అప్పుడొదిలీసిన సీసాలు పెంట -కుప్పలైపోయి..... చిదిగిపోయినన్ని చిదిగిపోయి, పోయినన్ని పోగ... తీరా లెక్కలు కిప్పుడు బొక్కలొచ్చాయిట. అత్తిరి లెక్క సెప్పమందట గవర్నమెంటు. ఎక్కడ్నుంచి తేవాలనీసి... ఎవడో దొబ్బుకు పోనాడని... ఆ దొబ్బుకుపోయింది మీ దండాశేనని ఆలరేడుపార్టీ వోలే ఆడిమీద కేసెట్టినారట.

ఇదంతా విన్నాక ముసల్దానికి నోటంట మాటరాలే. మనిషి కర్రగట్టినట్టయి బిగుసుకుపోయింది. గున్నమ్మ ధైర్యమయితే చెపుతోంది కాని ముసలిదాన్ని ఆ షాక్‌లోంచి తేరేటట్టు చేయలేకపోయింది.

దాలిగాడు వున్న పలాన బయలుదేరాడు. అన్నం నాయుడింటికెళ్ళి తన తమ్మున్ని విడిపించమని బతిమలాడేడు. 'సారీ నేనలాంటి సారాకేసుల్లో తలదూర్చను, తెలిస్తే నా ఓట్లు... ముఖ్యంగా నా ఆడోళ్ళ ఓట్లు పోవూ' అన్నాడు నాయ్డు. 'మీ పార్టీ కేన్వాసింగుకి తిరిగినాడు మా దండాశి' అన్నాడు దాలిగాడు. 'ఎంతమందో తిరుగుతారు, అంతమందికీ ఇచ్చుకుంటే బెయిళ్ళు, జెయిళ్ళు ఖాళీ అయిపోతాయి. అయినా మీవోడు ఆ కాంగ్రెసు వాళ్లతోనూ తిరిగాడు వాళ్ళనే అడగరాదూ... ' నాయ్డు నవ్వుతూ అన్నాడు. దాలిగాడి ఆశ నెరవేరలేదు. ఊరిలోని కాంగ్రెసు నాయకుడి దగ్గరికి వెళ్ళాడు.

"నువ్వు జూటుమిల్లులో మీ యూనియన్లో మంచి ఇదటగదా! సరే నువ్వు యూనియన్ నుంచి తప్పుకో, మీ తమ్ముణ్ని నేను ఇడిపిస్తా...."

దాలిగాడు అందుకు సిద్ధపడలేదు. కాబట్టి అతడితో ఇంక పనిలేదు అని తేల్చుకున్నాక ఇంక అక్కడ నిలవలేకపోయాడు. ఎందరెందరి చుట్టో రెండు మూడురోజులు అదేపనిగా తిరిగినా ఫలితం లేకపోయింది.

ముసలిదాని జబ్బేటో తెలియలేదు. అన్నం సయించేదికాదు. అదవా ఇతం సేసుకు

తిన్నా వాంతులయి నీర్సపడిపోయింది. సత్తికి జ్వరం తగ్గలేదు. తొంగున్నా తొంగోకపోయినా పలవరిస్తోంది.

ఆసుపత్రికి తీసుకెళ్ళి డాక్టరుకు చూపిస్తే ముసల్దానికీ దాని మనుమరాలికీ మందులు రాసిచ్చారు. అప్పోసప్పో చేసి కొందామన్నా మందుల షాపులు టర్నోవరు టాక్సని బందు పెట్టినారేమో దొరకలే. ఈ ఊరు ఆ వూరు తిరిగితెస్తే వారం పొద్దులో ఒకొడ్డుకు చేరినారు.

ఒకొడ్డుకు చేరినారూ అంటే పుల్లని పులుసుతో పిడికెడు మెతుకులు వండి పెట్టలేకపోయింది గున్నమ్మ. పూరా సరుకులన్నీ నిండుకున్నాయి. ఎక్కడా అప్పుపుట్టలే. ఎంతకని? ఎవరని? అసలు వూరంతా ఇంచు మించులాగే వుంది. ఊరు కాలిపోయినట్టు ఊళ్ళకి ఊళ్ళే కాలీచేస్సి వలసపోతున్నారెందరో. దాలిగాడు ఎలాగో బెత్తాయించుకొస్తానని నెల్లిమర్ల వెళ్ళాడు.

పెంటడూ సిమ్మాద్రీ చిన్న గుంటలిద్దరూ చుట్టికెలిపోతున్నారు. సత్తి జబ్బుపడి లేచిందేమో నీరసంపోలేదు. దానికి తోడిది. కళ్ళూ పళ్ళూ ఎక్కొచ్చి ముసల్దయితే బతికున్న శవంలాగే వుంది. ఆకలికి ఇంత గట్టి మనిషయిన గున్నమ్మా తట్టుకోలేక పోతోంది. రెండ్రోజులయిన పొయ్యిలో అగ్గుల్లేవు. పొయ్యిలో పిల్లులు లెగలేదు. నూకడు తన బతుకును తిట్టుకుంటూ మళ్ళీ క్లీనరు పనికెళ్ళాడో లేదోగాని ఇల్లు మాత్రం విడిచిపెట్టాడు.

తవిటి అల్లుడు కడుపుతో వున్న ఆమె కూతుర్ని బాదేసి ఎటుపోండో తెల్దు... తవిటి కూతుర్ని తీసుకొని ఏ వూరు పయనమయ్యిందో అదీ తెల్దు.

మూడోరోజుకు చిన్నపిల్లలిద్దరూ ఆకలితో సొమ్మసిల్లి పడిపోయారు, సత్తీ ముసల్దీ కూడా అంతే మరో గడియకో... గంటకోలా వున్నారు. గున్నమ్మకి కాళ్ళూ చేతులాడలేదు, తల తిరుగుతోంది. సొమ్మసిల్లిన పిల్లల్ని ఎత్తలేకపోయింది. గుండె లవిసేలాగ అరిచింది.

ఊళ్ళో ఎవరికి వాళ్ళే వొంటిగయిపోతున్నా ఒకరూ ఒకరూ చేరి గుంపయినారు. దాలిగాడూ సమయానికి వచ్చినాడు.

అప్పటికప్పుడు ట్రాక్టర్ల వేసుకొని చిన్నపిల్లలిద్దర్నీ, సత్తినీ, ముసలిదాన్నీ నెల్లిమర్ల తీసుకుపోయి ఇ.యస్.ఐ. ఆసుపత్రిలో పడేసినారు - ఆకలి తప్ప మరే జబ్బూ లేదన్నాడు డాక్టరు. సెలైన్లు అందరికీ ఎక్కించారు. గ్లూకోజ్ నీళ్ళు పట్టారు.

పదిమందీ పదిచేతులేసారు. కార్మిక సంఘం భుజం కాసింది. స్వచ్ఛంద సంస్థలు కాసింత ఆసరా నిచ్చాయి. మొత్తానికి ఎలగయితేనేం అంతా నిలబడి చావు అంచుదాక వెళ్ళిన ఆ కుటుంబాన్ని దక్కించుకున్నారు.

గున్నమ్మ గుండెనిండా ఊపిరి పీల్చుకుంది. ఆపదలో వున్న తమని ఆదుకున్నందుకు-తోటి మనుషులమీద అభిమానం పెరిగింది. నలుగురూ కలిసి మృత్యువుని కూడా తరిమినట్టనిపించింది.

నాగమ్మకి కబురు పంపితే -దాని పిల్లలకీ విరోచనాలూ వాంతులూ అవుతున్నాయని, అతిసారవ్యాధి ఇందంట ఎక్కువగా వుందనీ అటునుండి కబురొచ్చింది. ఎంత తెలియనివ్వకూడదనుకున్నా ముసలిదాని చెవిన ఆ మాటా పడింది. దాంతో ఆమె కళ్ళకింద జోరికలు ఆరలేదు. 'ఏ నీళ్ళు పడితే ఆ నీళ్ళుతాగడం వల్లే అతిసారం' అని కాంపుండర్లన్నారు. 'తాగడాకి మంచినీళ్ళ సౌకర్యమయినా లేద'ని పేసెంటుని తీసుకువచ్చిన మరొకామె వాపోయింది.

అంతా కలిసి దాలిగాడి చేతిలో పెట్టిన వెయ్యిరూపాయలకి అయిదొందల వరకూ-మందులకూ మాకులకూ పళ్ళరసాలకూ గ్లూకోజ్ నీళ్ళకూ వదిలిపోతేగాని ఆసుపత్రి వదల వల్లయిందికాదు. మిగిలిన సొమ్ముతో కుటుంబాన్ని సొంత వూరు చేర్చి చాలీసాలని సరుకులు తెప్పించడంతో వున్నది ఊర్చుకుపోయినట్టు ఇంకేమీ మిగల్లే!

రోజులు వారాలయి, వారాలు నెలలవుతున్నాయి.

వరినారుకి రెండు నెలల వయసు దాటీసింది. నీరులేక కునికీసిన నారు కునికీసినా, మిగిలిందానికి ఉభాలూ (ఊడ్పులూ) లేవు. మరి ఎన్ను కాయదన్నారు. ఊబల్లేక అలాగే వదిలీసి ఎదాలు పంటమీద ఆశపడుదుమన్నా నీటిసుక్క లేదు.

ఏ క్షణానికి ఏమవుతుందో తెలియని మిల్లు లాకౌట్ పరిస్థితుల్లో దాలిగాడు అటూ ఇటూ తిరగడం కష్టమయిపోయింది. ఊర్లో కూలి పనులూ పుట్టలే. రోజు గడవడం కష్టమయిపే.

చివరికి గున్నమ్మ కూడా పెనిమిటితో పిల్లలతో ముసలిదాన్ని తీసుకొని ఊరువిడిచి పెట్టింది. నెల్లిమర్ల ఊరి చివర పాకలోకి బతుకు మారింది. అయినా కూలి పనులు దొరకడంలే! కడుపు మంట తీరడంలే!

దాలిగాడు మిల్లు చుట్టూ తిరుగుతునే వున్నాడు. కార్మిక సంఘం మీద ఆశ ఊరంతా ఒక్కటి కావడంతో మరింత ఎక్కువయింది.

ముసల్ది దాలిగాడ్ని చూసినపుడల్లా మరింత మౌనానికి గురయ్యేది. అసలుకి దాలిగాడు ఓ అయిదేళ్ళ క్రిందటే అయిదారువేలకు 'సీటి' ( తన ఉద్యోగం తను మానేసి, అదే స్థానంలో ఆ పని ఇంకొకరికి ఇవ్వడం) అమ్మేసుంటే బాగున్ననుకుంది. ఇప్పుడు 'సీటి' ఇచ్చినా వెయ్యిరూపాయలు రావనుకుంది. చచ్చినా తన మనుమలు మిల్లులో పనులకి మాత్రం కుదరకూడదని అనుకుంది.

సత్తికంతా కొత్తగా వుంది. తమ ఊరెళిపోతే బాగున్ననుకుంది. చిన్నపిల్ల లిద్దరూ తమని బడికి పంపమని అల్లరి పెడుతూనే వున్నారు.

గున్నమ్మ దొరికితే కూలి పనికి వెళ్ళేది. దొరక్కపోతే మగని వెంట మిల్లు గొడవల్లోపడి తిరిగేది. వీలు చిక్కినపుడల్లా సొంతవూరు పోయి ఇల్లూ పొలమూ చూసుకువచ్చేది. క్షణం తీరిగ్గ వుండబుద్దయ్యేదే కాదు. బతుకుని తలచుకొని కుమిలిపోతే గుండె బరువుగా వుండేది. ఆ బరువుని దించుకోవాలంటే నలుగురితో కలిసి నాలుగు పనులూ చెయ్యాలని వుండేది. సమస్యల్ని సాధించాలనీ వుండేది. అందులో ఏదో తృప్తి వుండేది.

మిల్లు తెరవడానికి గవర్నమెంటు చొరవ చూపించడం లేదని కార్మిక సంఘం విమర్శించింది. మన ఏరియాలోనే మంత్రిగారున్నా, పట్టించుకుంటామనే కొంప కూల్చేసినారనీ విమర్శించింది. దాంతోటి ఆయనకి పోలీసు కొట్టే నాయకులు పళ్లివర గరుసుకొని సంఘం మీదకి, కార్మికుల మీదకి తగువుకొచ్చినారు. 'మంత్రిగారు జోక్యం చేసుకోవాలా వద్దా?' అనీసి; చేసుకోవాలని అన్నోళ్ళివి మాత్రమే సంతకాలు సేకరించినారు. ఆ తంతు ఎక్కడిదాక పోయిందంటే మంత్రిగారి వంది మాగదులంతా ఇంటింటికి తిరిగినారు. 'మీకు ఓట్లెయ్యమంటే ఏస్తాంగాని కార్మిక సంఘాన్ని వదిలికొని రాలేమ'ని అంతా తేల్చి చెప్పినారు.

కార్మిక సంఘాన్ని వదులుకుంటేగాని లాకౌటు ఎత్తడం అవదని మంత్రిగారే అన్నారు. ఆ ధైర్యాన్ని చూసుకొనే మిల్లు యాజమానులు హైదరాబాద్ వొచ్చినా సరే, మిల్లు లాకౌట్ ఎత్తకుండానే మిల్లు మూసిన కాలానికి జీతాలు ఇవ్వమనీసి అన్నారు. తరువాత లాకౌట్ కాలానికి జీతాలు చెల్లించమని కోర్టుకెక్కితే లాభం లేదనీసి అన్నారు. అప్పుడు కార్మిక మంత్రిగారున్నారు. మన మంత్రిగారనుకున్న స్థానిక మంత్రీ వున్నారు.

ఇవన్నీ చూస్తున్న దాలిగాడికి అంతా అయోమయంగా అనిపించింది. దాంతో ఆ మరునాటి నుంచి ఎటూ తిరగడం మానేసి ఇంట్లో కూర్చున్నాడు. ఈదేశం బాగుపడదన్నాడు. ఈ ప్రజలు బాగుపడరన్నాడు. లేకపోతే మంత్రిగారి జోక్యం కావాలని నూటరవై మంది సంతకాలు పెట్టడమేమిటన్నాడు. స్వార్థం వున్నంత కాలం ఏం చేసినా ఏమీ ఒరగదన్నాడు.

గున్నమ్మకి దాలిగాడి పద్ధతేమీ నచ్చలేదు. కోపం కూడా వచ్చింది.

ఇన్నాళ్ళా వచ్చిన కోపం పెదవి చాటు దాచుకోలేదు. పైగా ఆ కోపాన్ని మాటల్లో కూడా పెట్టింది.

"ఏ అడ్డూ లేకుండా సాగిపోతే అది పోరెలగవుద్ది? అయినా మనుషులందరూ ఒక్కలాగే నువ్వనుకున్న తీరుగుంతే ఇన్ని ఇవేల జరుగుతాయి? సోర్ధ ముండబట్టే కదా రెండేళ్ళ మునుపున్న రెడ్డి సంఘాన్ని నట్టేట్లొదిలీసి ఆ యజమానుల దగ్గర డబ్బుతిని పారిపోండు. ఇప్పుడు సంఘం నాయకులు మంచోలై నిలబడీసరికి ఏలినోలు ఎంతో సక్కగా యజమానుల్తోటి సెయ్యికలిపినారు. లేప్పోతే ఇంత దిసా ఏనికి? ఆల మూతినాకిన గండలు, కాలు పిసికిన గండలు సంతకాలు బయ్యం మీదెట్టించినా, ఆశ సూపించినా అదంతా ఆలకి బలము లేకపోయినా కసరత్తు సెయ్యడమేగదా" అని సులువుగా తీసి పారేస్తున్న గున్నమ్మని చూస్తే దాలిగాడికి ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ దాలిగాడే చెప్పేవోడు, అలాటిదివాళ గున్నమ్మే దాలిగాడికి ధైర్యం చెప్పింది. ముసల్ది గున్నమ్మని మనసులోనే మెచ్చుకుంది.

గున్నమ్మే పిల్లల్ని తీసుకువెళ్ళి బడిలో జాయిన్ చేసింది. ఇంకా పేర్లు వెయ్యకపోయినా పిల్లలు వెళ్ళివస్తున్నారు.

ఆరోజు సాయంత్రం పాకలూడ బెరకడానికి వచ్చిన పంచాయితీ మనుషుల్ని గున్నమ్మ అడ్డుకుంది. అడ్డుకున్నప్పుడు ఆమె ఒక్కతే అయినా ఆ తరువాత అందరూ నిలిచారు. అలా నిలిచాక ఏనుగు బలం వచ్చింది గున్నమ్మకి. పెనక పట్టుకు లాగుతున్న ఒకడి ఫిల్టీ పట్టుకులాగింది. పరువుపోయిందనుకొని పారిపోయినోడు పోలీసులతో వచ్చిపడ్డాడు.

గున్నమ్మని వారం రోజులు జైల్లెట్టినారు. పోలీసుల పోట్లూ తిట్లూకి వల్లు నొప్పిపుట్టినా, తవిట్ని జైల్లో చూసినందుకు ఆశ్చర్యపడినా -తోడుగ మనిషి..... అదీ ఇంతకాలం వెతుకుతున్న మనిషి దొరికినందుకు మనసు సేద తీరింది. ఎక్కడలేని సత్తువ వచ్చింది.

తవిటి ఊరొదిలాక తన అన్న దగ్గరికి మద్దిబోని వెళ్ళిందట. అక్కడ తాటిపూడి రిజర్వాయరు నీరు మంత్రిగారి భూములకు దొంగచాటున వదులుతుంటే, నలుగురూ కలిసినపుడు తనూ వెళ్ళి అడ్డుకుందట. పొన్నూరు దాయొచ్చి ఇదవడమా అని కళ్ళగ్గసమయి ఊరిపెద్దలకు కోపమొచ్చి దాని అన్నమీదకొస్తే - ఊరొదిలి కూతురిని తీసుకొని వచ్చేసిందట. మళ్ళీ అల్లుడొచ్చి పడ్డాడట. డబ్బులడిగేడట. ఇవ్వకపోతే కూతురికి విడాకులు ఇస్తానన్నాడట. కూతుర్ని కొట్టినాడట. కడుపు పోయిందట. దాంతోటి తాల్లేక

కత్తిపీటతో అల్లుడి తలమీద ఒక్కదెబ్బవేసిందట. ఆడు సచ్చినోడో బతికినాడో తెల్దు గాని తవిట్ని జైళ్ళో ఏసినారట.

తవిటి జైళ్ళో వుండగనే గున్నమ్మ బయటకొచ్చింది. వచ్చిన తర్వాత కూడా గున్నమ్మలో ఏరకమైన మార్పూ లేకపోవడం దాలిగాడికి ఎంతో ఆశ్చర్యం వేసినా, ఆ విషయాన్ని కదిపినా అదేమి పెద్ద విషయం కానట్టుగానే మాట్లాడేది.

మిగతా పాకల్లో వున్న జనమంతా గున్నమ్మ చుట్టూ పోగయేవారు. ఏదయినా గున్నమ్మని అడిగేవారు. గున్నమ్మ మాటే వాళ్ళకు గురయింది. దాలిగాడికి గున్నమ్మ మీద ప్రేమున్నా ఇప్పుడు గౌరవం కూడా పెరుగుతోంది.

యూనియనోళ్ళు ఏ మీటింగు పెట్టినా గున్నమ్మని ప్రత్యేకించి కబురెట్టేవారు. కబురెట్టకముందే గున్నమ్మా పయనమయ్యేది. పాటలూ పాడేది.

ఇన్నాళ్ళా గున్నమ్మకిప్పుడు జీవితం మీద విసుగులేదు. ఏవేవో కొత్త కొత్త ఆలోచనలు వచ్చేవి. మునపటికంటే వుషారుగా వుండడం ముసలిదాని కళ్ళనీ దాటిపోలేదు.

మిల్లు తెరవమని రాస్తారోకో, రైలురోకో, ధర్నాలు జరిపితే గవర్నమెంటు మిల్లుని స్వాధీనం చేసుకోలేదుగాని లాకౌటుపై అలవాటుగ 'నిషేధం' ప్రకటించింది. జీవో కూడా జారీ చేసింది. అయినా మిల్లు యజమానులకి ఈక తెగలే. మిల్లు తెరలే.

సరీగప్పుడే మిల్లు యజమానులు దొంగచాటుగ మిల్లులోకి దూరడం, రైలుపట్టాలంట బేళ్ళను వేసుకు పారిపోవడానికి ప్రయత్నించడంతో ఊరు గుప్పున పోగయింది. మనిషి కడుపునొచ్చి వెళ్ళొచ్చే లోపే చీమల్లా అన్నివైపుల్నుండి అన్ని వయసులవాళ్ళా చేరిపోయారు. మిల్లుని చీమ కూడా ఇట్నుంచటు అట్నుంచిటు దూరడానికి వీలు లేకుండా దిగ్బంధనం చేసారు. వేలాది మంది చుట్టూ కోటలా నిల్చున్నారు. గున్నమ్మకి ఈ దెబ్బతో చావో రేవో తేలిపోవచ్చనే అనిపించింది.

బేళ్ళు మోసుకుపోతున్న గూడ్సు రైలుకి ఎవరో ఆడమనిషి అడ్డం నిలబడింది. నిలబడిందికాక తన ఎర్రని రవికనిప్పి జెండా ఎత్తిపట్టింది. వెనకాలే వేలాది మందితో గున్నమ్మ రైలు పట్టాలపై గేటయ్యింది. రైలు ఒక్క అరడుగు ముందుకు పోలేక కీచుమంటూ ఆగిపోయింది. డ్రైవరు దిగిపోయి దండమెట్టేసాడు. ఆ బేళ్ళను నిలుపు చేసుకోవడంతో తమ ఆస్తిని తాము దక్కించుకున్నట్లు అనుభూతి పొందారు.

గున్నమ్మ ఎర్రని రవిక జెండా పట్టినామెలో తవిట్ని చూసింది. లోకంలో ఎందరో తవిటిలు దివిటీలై వున్నందుకు తనూ ఆ మార్గంలో వెళుతున్నందుకు ఎంతో గర్వంగా తృప్తిగా వుంది.

'అదిగో పారిపోతండు' మాట. ఆ మాటతో అటు పరుగు. ఆ పరుగు చూస్తే గున్నమ్మకి కురుక్షేత్రంలో సైన్యం కదిలినట్టనిపించింది. చెట్లెక్కిపోయి కాపుకాసిన వాళ్ళకయితే లెక్కలేదు. ఒక్కో గుంపు గుంపుకాదది దండే.... దండయాత్రే అది!

మిల్లు దిగ్బంధనం ఎంతలా వుందంటే మిల్లులోంచి వచ్చే మురుగు నీటి దగ్గరా దిగి కాపలాకాశారు. మూత్రశాలల దగ్గరా కాపు కాసారు. అలా ఒక గంటా ఒక దినం కాదు. ఒక రాత్రీ ఒక పగలూకాదు. నలభై రెండు గంటలకు పైగా కాపు కాశారు. యుద్ధంలో నిల్చున్నట్టే వుంది. పోలీసులు వేనులకొద్దీ దిగబడినా సరే ఎవ్వరూ అడుగు వెనక్కి వేయలేదు. కలెక్టరూ, పోలీసు సూపరెంటూ .... ఎవ్వడొచ్చినా లచ్చిం లేదు.

"మేం కష్టపడ్డ కష్టానికి మాకు రావల్సిన జీతమే ఇవ్వండి" అందరిదీ ఒకటే మాట.

"లోపలున్న మేనేజ్‌మెంటుకి మూడ్రోజులుగా తిండిలేదు"

"మాకూ లేదు, ఈ మూడ్రోజులుగానే కాదు రెండు నెల్లుగా. జీతాలివ్వందే ఎవ్వర్నీ వదలం".

పోలీసులు రంగంలోకి దిగారు. ఎంతమంది దిగినా అక్కడున్న జనంలో కనీసం పదోవంతు కాలేకపోయారు. అయినాసరే బాష్పవాయువు (టియర్ గేస్) ని విడిచి పెట్టబోయారు కాని ఎవరూ కళ్ళు తిరిగి పడిపోరని ధైర్యాన్నిస్తూ నాలుగు బస్తాల ఉల్లిపాయల్ని కార్మిక నాయకులు అందరికీ పంచిపెట్టారు.

ఇంత 'ఉల్లిపాయల పోరాటం' జరిగితేగాని మేనేజ్‌మెంటు దిగిరాలేదు. కార్మిక నాయకుల్ని చర్చలకు పిలవక తప్పలేదు.

మొత్తానికి ప్రాణంపోయినా పరవాలేదని పోరితే, జూన్ నెల జీతాలు ఆగష్టు ఏడోతేదీకి అందాయి. మిల్లు లాకౌటు ఎత్తకపోయినా ఇదొక ముందడుగని గున్నమ్మ అనుకుంది.

దాలిగాడి దగ్గరో రెండొందలు తీసుకొని తవిటి కూతుర్ని చూసి రావడానికి, సాయపడడానికి గున్నమ్మ తమ ఊరు బయలుదేరింది.

కరువు బతుకు మీద ఎంత దాడి చేసి ఎన్నిటిని పోగొట్టినా .... ఇన్నాళ్ళూ లేనిదేదో ఇప్పుడు గున్నమ్మలో వుంది. అదే బతుకుని ఇక ముందు నడిపిస్తుందని గున్నమ్మకి తెలిసినా తెలియకపోయినా అది నిజం! అందుకే ఆమె రాక కోసం ఊరు ఉవ్విళ్ళూరుతోంది!!

*రచన : జూన్ - ఆగస్టు '93*

*ప్రచురణ : మహిళామార్గం, సెప్టెంబర్ - డిసెంబర్ '93; జనవరి - మార్చి '94*